



- ప్రతి ఒక్కరూ తెలుగులోనే మాట్లాడాలి
- తెలుగు సాహిత్యానికి ప్రొద్దుటూరు పెట్టింది పేరు
- పూర్వ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు
- తెలుగు భాష గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి
- కలెక్టర్
- కళకళలాడిన కలమల్ల
- విజయవంతమైన తెలుగు భాషా దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లోతేటి శివశంకర్

తెలుగు ప్రాచీనతను కాపాడుకోవాలి

ఎర్రగుంట్ల, ఆగస్టు 29: తెలుగు భాష చాలా ప్రాచీనమైనదని, దీని ప్రాచీనతను మనందరం కాపాడుకోవాలని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. తొలి తెలుగు శాసనాలున్న కలమల్లలో గురువారం జరిగిన తెలుగుభాషా దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఎర్రగుంట్ల వరకు రైలులో వచ్చిన ఆయన అక్కడి నుంచి రోడ్డు మార్గాన కలమల్లకు చేరుకున్నారు. అక్కడ అధికారులు, ఎన్డీయే నేతలు, తెలుగుదనం ఉట్టి పడే వేషధారణలో చిన్నారులు, జానపద కళాకారులు ఆయనను స్వాగతించారు. ఈ సందర్భంగా ప్రాచీన సాంస్కృతిక, కవుల, సాహితీవేత్తల, తెలుగు చరిత్రపై ఏర్పాటు చేసిన ఛాయా చిత్ర ప్రదర్శనను ఆయన తిలకించారు. తొలి తెలుగు శాసనాలను పరిశీలించారు. చిన్నారుల నృత్యప్రదర్శనలను, సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించారు. అనంతరం తెలుగుభాషా దినోత్సవానికి జ్యోతి ప్రజ్వలన చేశారు.

ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. ఇంట్లో, వీధిలో, బడిలో, గుడిలో అమ్మఒడిలో, నారుమడిలో మాతృభాషనే మాట్లాడాలన్నారు. సెల్లులు, టీవీలను పరిమితంగా వాడితే ఉపయోగమని, లేదంటే జబ్బులొస్తాయన్నారు. అవసరమైన వరకే ఎలక్ట్రానిక్ మిషనరీని వాడాలని, ప్రతిదానికి గూగుల్‌పై ఆధార పడరాదన్నారు. చివరకు భర్త పేరును కూడా గూగుల్‌లో చూసి చెబుతామనే స్థితికి రాకూడదన్నారు. మన భాష సంస్కృతికి చుక్కాని లాంటిదని, అది మనతో ఆగిపోరాదన్నారు. శాసనాల సంరక్షణకు ఉభయ తెలుగు రాష్ట్ర ప్రభుత్వాల ముఖ్యమంత్రులు చొరవ తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులు, ఉత్తరప్రత్యుత్తరాలన్నీ తెలుగుభాషలోనే ఇవ్వాలన్నారు. కలమల్ల శాసనాలకు మరింత గుర్తింపు తెచ్చేందుకు పర్యాటక కేంద్రంగా మార్చాలన్నారు. తెలుగు సాహిత్యానికి ప్రొద్దుటూరు పెట్టింది పేరన్నారు. అందుకు పెన్నానీరు కారణమై ఉండవచ్చన్నారు. అనేకమంది పండితులు ఈ ప్రాంతంలో ఉన్నారని, గొప్ప గొప్ప సాహిత్యాలు రాశారని తెలుగుభాషకు, తెలుగు రాష్ట్రాలకు గొప్ప పేరు తెచ్చారన్నారు.

మనం దరం తెలుగువాళ్లం, తెలుగులోనే మాట్లాడుదా మని పిలుపునిచ్చారు. విజ్ఞానం అందరికి అందాలనే సంకల్పంతో వ్యవహారిక భాషా ఉద్యమానికి గిడుగు రామ్మూర్తి శ్రీకారం చుట్టారన్నారు. ఆయన పుట్టిన రోజును తెలుగుభాషా దినోత్సవంగా చేసుకోవడం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా గిడుగు రామ్మూర్తి పంతులకు నివాళులర్పించారు.

పండితుల గడ్డ కడప : కలెక్టర్

కడప జిల్లాలో ఎంతోమంది పండితులు ఉన్నారని కలెక్టర్ లోతేటి శివశంకర్ అన్నారు. పండితుల గడ్డ కడప అన్నారు. సుమతి శతకం రాసిన బద్దెన ఇక్కడి వాడే అన్నారు. సామాన్య ప్రజానీకానికి కూడా అర్థమయ్యే రీతిలో నన్నెచోడుడు, వేమన, మొల్ల.. ఇలా అనేక మంది తెలుగు సాహిత్యానికి విశేషంగా కృషిచేశారన్నారు. తొలి తెలుగు శాసనాలు లభించిన చోటే తెలుగుభాషా దినోత్సవం జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమానికి పిలవగానే ముఖ్యఅతిథిగా వచ్చిన వెంకయ్యనాయుడు కృతజ్ఞతలు తెలిపారు. సామాజిక, ఆర్థిక విధానాలపై తెలుగును ఎలా సంస్కరించుకోవాలో ఆలోచించుకోవాలన్నారు. ప్రతి సబ్జెక్టులో తెలుగును ఎలా తీసుకురావాలో ఏవిధంగా తీసుకెళ్లాలో ఆలోచించాలన్నారు. తెలుగు భాషను పిల్లల ద్వారా ఎలా ముందుకు తీసుకెళ్లాలనే విషయంపై దృష్టిపెట్టాలన్నారు. ముందుగా వారి పేర్ల అర్థాలు వారికి తెలిసేలా చేయాలన్నారు.

తెలుగు ఎంతో పవిత్రమైంది : ఆది

తల్లిపాలు ఎంత పవిత్రమో.. తెలుగు భాష కూడా అంతే పవిత్రమైనదని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. ఇప్పుడు చదువుకుంటున్న రవారిలో 27శాతం మంది మాత్రమే తెలుగు చదివే వారు ఉన్నారన్నారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాలలో తెలుగులోనే చదివానన్నారు. కలమల్లలో క్రీ.శ.575లో చోళరాజులు శాసనాలు వేశారని అందుకే కలమల్ల ఇంతటి ప్రాధాన్యత సంతరించుకుందన్నారు. కడప జిల్లా ఒకప్పుడు ఫ్యాక్షన్ జిల్లాగా ఉండేదని, ఇప్పుడు ఆ సంస్కృతి పోయిందన్నారు. కొప్పర్తిలో పరిశ్రమలు, జిల్లాకు పవర్‌ప్లాంట్లు వస్తున్నాయని వేలమందికి ఉపాధి దొరుకుతుందన్నారు.

కళకళలాడిన కలమల్ల

తొలి తెలుగు శాసనాలు వెలుగు చూసిన కలమల్ల గ్రామంలో గిడుగు రామ్మూర్తి 160వ జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవం నిర్వహించడంతో ఈ గ్రామం గురువారం ఆద్యంతం కళకళలాడింది. బహుభాషా కోవిదుడు పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ఎమ్మెల్యే, కలెక్టర్ లాంటి అతిరథులు గ్రామానికి రావడంతో పెద్దఎత్తున స్వాగత ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. పందిర్లు వేశారు. సభా ప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. మహిళలు, విద్యార్థులు, గ్రామస్తులు పెద్దఎత్తున సభా ప్రాంగణం వద్దకు చేరుకుని ప్రసంగాలు విన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. గ్రామానికి చెందిన మహిళల కోలాటం, చిన్నారుల నృత్యాలు, కవితలు, పద్యాలాపన, పోతురాజు విన్యాసం, ఎన్టీయార్ పాటకు అభినయం వంటి కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

సాహితీవేత్తలకు సన్మానం

తెలుగుభాషా దినోత్సవంలో భాగంగా జిల్లాకు చెందిన పలువురు సాహితీవేత్తలను వెంకయ్యనాయుడు సన్మానించారు. శతావధాని నరాల రామారెడ్డి, తవ్వా ఓబుల్‌రెడ్డి, సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి, డాక్టర్ బి.సంజీవమ్మ, షేక్ హుసేన్ సత్యాగ్ని తదితరులను శాలువా కప్పి, పూలమాల, జ్ఞాపికతో సత్కరించారు. అలాగే వెంకయ్యనాయుడును ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, కలెక్టర్ శివశంకర్, భాషోపాధ్యాయ సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు. గ్రామానికి చెందిన బీజేపీ, కూటమి నాయకులు సుబ్బరామయ్య, బాబు, తారకనాథరెడ్డి, రమణారెడ్డిలు వెంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో జేసీ అదితిసింగ్, డీఈవో అనురాధ, జడ్పీ సీఈవో సుధాకర్‌రెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి చదిపిరాళ్ల భూపేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పుత్తా నరసింహారెడ్డి, డిప్యూటీ డీఈవో రాజగోపాల్‌రెడ్డి, ఎంపీడీవో భాగ్యలక్ష్మి, తహసీల్దార్ శోభన్‌బాబు, సర్పంచి చిత్రాల హెప్సీబా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి, ఒంటేరు శ్రీనివాసరెడ్డి, టీడీపీ నాయకులు ముక్తియార్, ఈవీ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమానికి జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వెంకయ్యనాయుడు, తదితరులు



తొలి తెలుగు శాసనాలు



శాసనాలను పరిశీలిస్తున్న వెంకయ్య నాయుడు, ఆది తదితరులు







సాహితీ ప్రముఖులను సన్మానిస్తున్న వెంకయ్య నాయుడు



వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో వెంకయ్య నాయుడు తదితరులు



ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ర్యాగింగ్ భూతం మింగేసింది!

- కలికిరి జేఎన్టీయూ బీటెక్ విద్యార్థి ఆత్మహత్య
- స్వస్థలం ఖాజీపేట మండలం మల్లాయపల్లె
- సీనియర్ విద్యార్థులు వేధించారనే ఆరోపణలు
- కలికిరి పోలీసులతో కలిసి దర్యాప్తు చేస్తున్న మైదుకూరు పోలీసులు



ప్రవీణ్ (ఫైల్‌ఫొటో)

కలికిరి/మైదుకూరు రూరల్, ఆగస్టు 29: తండ్రి మెకానిక్ పనిచేస్తూ పిల్లలను పెద్ద చదువులు చదివిస్తున్నాడు. పెద్ద కుమారుడు బీటెక్ పూర్తి చేయగా రెండో కుమారుడు బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. పిల్లల చదువు పూర్తయితే తమ కష్టాలు తీరుతాయని ఎన్నో ఆశలు పెట్టుకున్న ఆ తల్లిదండ్రుల ఆశలు అడియాసలయ్యాయి. ఎన్నో ఆశలతో కలికిరి జేఎన్టీయూలో రెండో సంవత్సరం బీటెక్‌లో చేరిన చిన్న కుమారుడు ప్రవీణ్ (19) కళాశాలలో చేరిన మూడు రోజులకే హాస్టల్‌లో సీనియర్లు చేసిన ర్యాగింగ్ భూతానికి బలయ్యాడని తల్లిదండ్రులు రోదిస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. కడప జిల్లా ఖాజీపేట మండలం మల్లాయపల్లెకు చెందిన నంద, వసంత దంపతులు తమ స్వగ్రామం నుంచి మైదుకూరు మండలం జీవీ సత్రం వెళ్లి మెకానిక్‌గా పనిచేస్తూ స్థిరపడ్డారు. ఆ దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు బీటెక్ పూర్తి చేయగా చిన్నకుమారుడు ప్రవీణ్ పులివెందుల లయోలా పాలిటెక్నిక్ కాలేజీలో పాలిటెక్నిక్ పూర్తి చేశాడు. ఇంజనీరింగ్ చేసేందుకు ఈ-సెట్‌లో ర్యాంకు తెచ్చుకున్నాడు. మూడో విడత కౌన్సెలింగ్‌లో కలికిరిలోని జేఎన్టీయూలో సీటు వచ్చింది. బీటెక్ (మెకానికల్) రెండో సంవత్సరంలో ఈ నెల 12న చేరి ఈనెల 20వ తేదీ కళాశాలకు వచ్చి మూడు రోజులపాటు తరగతులకు హాజరయ్యాడు. హాస్టల్‌లో ర్యాగింగ్ ఎక్కువగా ఉండటంతో భయపడి 23వ తేదీ ఇంటికి వచ్చాడు. అదే విషయం ఇంట్లో చెప్పాడు. అయితే ర్యాగింగ్ అనేది మామూలేనని, కాలేజీకి వెళ్లాలని ఇంట్లో వాళ్లు చెప్పడంతో కొన్నిరోజుల తర్వాత వెళతానని వారికి సమాధానం ఇచ్చాడు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి పురుగుల మందు తాగాడు. బుధవారం ఉదయం తీవ్ర అస్వస్థతకు గురైన ప్రవీణ్‌ను కుటుంబ సభ్యులు మైదుకూరు ఆసుపత్రికి తీసుకెళ్లారు. సాయంత్రం డిస్చార్జ్ చేశారు. ఇంటికి వచ్చిన కాసేపటికే పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో వేలూరు సీఎంసీకి తీసుకెళ్లారు. అయితే అక్కడ వైద్యులు బతకడని చెప్పి అడ్మిట్ చేసుకోలేదు. దీంతో తిరుపతి స్విమ్స్ ఆసుపత్రికి వచ్చి తెల్లవారుజామున చేర్పించగా వెంటనే అతను మృతి చెందాడు. హాస్టల్‌లోని సీనియర్ విద్యార్థులు ర్యాగింగ్ చేసిన కారణంగానే ప్రవీణ్ బలవన్మరణానికి పాల్పడ్డట్లు ప్రచారం జరుగుతోంది. తన మేనల్లుడు ప్రవీణ్‌ను సీనియర్ విద్యార్థులు ర్యాగింగ్ చేసిన కారణంగానే మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రవీణ్ మేనమామ గుర్రంకొండ చంద్ర మైదుకూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు మైదుకూరు పోలీసులు జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో దర్యాప్తు చేస్తున్నారు. కలికిరి ఇన్‌స్పెక్టర్ కె.రెడ్డి శేఖర్ రెడ్డి కూడా మైదుకూరు పోలీసులతో కలిసి విచారణ చేస్తున్నారు. కలికిరి పోలీసులతో కలిసి మైదుకూరు పోలీసులు గురువారం కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సహచర విద్యార్థులను క్షుణ్ణంగా విచారించారు. ప్రవీణ్ ఆత్మహత్యకు ర్యాగింగ్ కారణమా లేదంటే మరేదయినా కారణాలున్నాయా అన్న కోణాల్లో పోలీసులు గురువారం రాత్రి వరకూ కళాశాలలోనే విచారణ జరుపుతున్నారు. ప్రవీణ్ కళాశాలలో చేరి మూడు రోజులు మాత్రమే ఉన్నాడని, ఈ మూడు రోజుల్లోనే ఏమి జరిగి ఉండొచ్చనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రవీణ్ ఎవరితో కలివిడిగా ఉండలేదని, ముభావంగా ఉండే వాడని తోటి విద్యార్థులు చెబెతున్నట్లు తెలిసింది. కొంతమంది సీనియర్ విద్యార్థులు కలుగజేసుకుని ఇలా ముభావంగా వుంటే ఎలాగంటూ చురుగ్గా ఉండాలని ప్రోత్సహించేందుకు మాత్రం ప్రయత్నించినట్లు పోలీసులకు చెప్పినట్లు సమాచారం. ఇప్పటి వరకూ ర్యాగింగ్ కారణంగానే ప్రవీణ్ ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు చేస్తేగానీ అసలు విషయం బయటకు రాదని చెబుతున్నారు.

పింఛన్లు పంపిణీ రేపే

కడప (కలెక్టరేట్), ఆగస్టు 29 : ఎన్టీఆర్ భరోసా పింఛన్లను శనివారమే పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ లోతేటి శివశంకర్ గురువారం ఒక ప్రకటనలో విడుదల చేశారు. సెప్టెంబరు 1వ తేదీ ఆదివారం రావడంతో ఒక రోజు ముందుగానే పింఛన్లు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. ఈ నెల 31న లబ్ధిదారులు పింఛను అందుకోలేక పోతే సెప్టెంబరు 2న పింఛను తీసుకునే అవకాశం ఉందని వివరించారు. ఈ మేరకు ఆగస్టుకు సంబంధించి జిల్లాలోని 2,63,283 మంది లబ్ధిదారులకు రూ.112.22 కోట్లు నిధులు విడుదల అయ్యాయని పేర్కొన్నారు. ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు ఒక రోజు ముందుగానే పింఛన్ల పంపిణీ విషయాన్ని లబ్ధిదారులకు 31వ తేదీ ఇళ్ల వద్దనే ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

'సజ్జల నా భూమిని కొట్టేశారు'

అమరావతి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడు సజ్జల రామకృష్ణారెడ్డి, ఆయన కుటుంబసభ్యులు తన భూమిని కబ్జా చేశారని చింతకొమ్మదిన్నెకు చెందిన బుక్క రాజానాయక్ జనవాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. అమరావతిలో గురువారం జనసేన పార్టీ నిర్వహించిన జనవాణి కార్యక్రమంలో పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ వినతులు స్వీకరించారు. '20 ఏళ్ల క్రితం డీకేటీ పట్టా కింద ప్రభుత్వం మాకు కేటాయించిన 5.14 ఎకరాలను సజ్జల ఎస్టేట్‌లో కలిపేసుకున్నారు. భూమి అడిగితే రేటు కడతామంటున్నారు. మాట్లాడితే చంపేస్తామని బెదిరిస్తున్నారు. అధికారులకు ఫిర్యాదు చేస్తే అయిన కాడికి అమ్ముకుపొమ్మంటున్నారు. కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లినా, స్పందనలో ఏడుసార్లు ఫిర్యాదు చేసినా స్పందన కరువైంది. సజ్జల, ఆయన కుటుంబ సభ్యుల నుంచి ప్రాణహాని ఉంది. నాకు, నా కుటుంబానికి రక్షణ కల్పించండి' అని రాజానాయక్ విన్నవించారు. దీంతో మంత్రి కడప జిల్లా కలెక్టర్‌కు ఫోన్ చేసి రాజానాయక్ అర్జీ వివరాలు తెలిపారు. పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు.

జడ్పీ పీఠాన్ని కాపాడుకునేందుకు..

వైసీపీ పాట్లు..!

- ఇప్పటికే ఒకసారి జడ్పీటీసీలతో జగన్ భేటీ
- మరోసారి ఉమ్మడి జిల్లా వైసీపీ నేతల చర్చలు
- ఒక్కొక్కరికి ఐదు లక్షలు ఇచ్చేలా ఒప్పందం?

(కడప-ఆంధ్రజ్యోతి): వైసీపీ ఘోర పరాజయానికి సంబంధించి వంద రోజులు కాక ముందే ఆ పార్టీ గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటోంది. పలువురు రాజ్యసభసభ్యులు టీడీపీ, జనసేన, బీజేపీలోకి జంప్ అవుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇది ఆ పార్టీ నేతలను కలవరపాటుకు గురిచేస్తోంది. జగన్ సొంత జిల్లాలోనే సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయం చవిచూసింది. ఇంకా ఆ దెబ్బ నుంచి కోలుకోక ముందే జడ్పీ పీఠాన్ని టీడీపీ లాగేసుకుంటుందేమో అనే భయం వైసీపీని వెంటాడుతోంది. సొంత జిల్లాలో పీఠం చేజారిపోతే అది పార్టీకి తీవ్ర నష్టం చేకూరుస్తుందని భావించిన వైసీపీ అధిష్టానం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. సొంత జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, పలువురు పార్టీ నేతలతో ఇటీవలే తాడేపల్లిలో పులివెందుల ఎమ్మెల్యే, మాజీ సీఎం జగన్ ముఖాముఖి నిర్వహించారు. జడ్పీ చైర్మన్ అభ్యర్థిగా బి.మఠం జడ్పీటీసీ రామగోవిందరెడ్డిని ఖరారు చేశామని ఆయనను ఎన్నుకోవాలంటూ సూచించారు. ఆ సమావేశానికి పలువురు జడ్పీటీసీలు డుమ్మా కొట్టారు. అధికారంలో ఉన్నప్పుడు కొందరికి మాత్రమే పెద్దపీట వేశారు. పంచాయతీలతో పాటు మండలపరిషత్, జిల్లాపరిషత్‌ను నిర్వీర్యం చేశారు. దీంతో జడ్పీటీసీలు జగన్‌పై గుర్రుగా ఉన్నారు. దీనికి తోడు ఏకపక్షంగా రామగోవిందరెడ్డిని ప్రకటించడంతో వీరిలో అసంతృప్తి మరింత ఎక్కువైంది. ఆలస్యం చేస్తే అసలుకే మోసం వస్తుందని భావించిన వైసీపీ అధిష్టానం వీరిని బుజ్జగించే కార్యక్రమానికి తెరలేపింది. బుధవారం రాజంపేట మండలం ఆకేపాడులో ఎమ్మెల్యే, మాజీ జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి జడ్పీ టీసీలతో సమావేశం నిర్వహించారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రఘురామిరెడ్డి, శ్రీనివాసులు, శ్రీకాంత్‌రెడ్డి, కడప మేయరు సురేశ్‌బాబు, జడ్పీటీసీలు, పలువురు వైసీపీ నేతలు పాల్గొన్నారు.

తాయిలాలతో శాంతపరిచే యత్నం

ఉమ్మడి జిల్లాలో 50 జడ్పీటీసీ స్థానాలు ఉన్నాయి. ఇందులో గోపవరం మాత్రమే టీడీపీ దక్కించుకుంది. మిగతా 49 మంది వైసీపీ వారే. ఒకరు చనిపోవడం, ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానానికి ఆకేపాటి అమరనాథరెడ్డి రాజీనామా చేయడంతో రెండు స్థానాలు తగ్గాయి. కొందరు టీడీపీలోకి వెళ్లారు. ఇక నోటిఫికేషన్ వస్తే ఖాళీగా ఉన్న రెండు జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తారు. ఈ దఫా టీడీపీ పోటీ చేసే అవకాశం ఉందంటున్నారు. జడ్పీ చైర్మన్‌గా టీడీపీ నుంచి పలువురు పేర్లు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో జడ్పీపీఠం కాపాడుకునేందుకు వైసీపీ ప్రయత్నాలు మొదలుపెట్టింది. వచ్చేది మన ప్రభుత్వమేనని, ఇప్పుడు టీడీపీలోకి వెళ్లకుండా పార్టీని నమ్ముకున్న వారికి భవిష్యత్తులో మంచి ప్రాధాన్యత ఇస్తామని చెబుతూనే తాయిలాలు పంచుతున్నట్లు సమాచారం. ఒక్కొక్కరికి రూ.5లక్షలు ఇచ్చేందుకు నిర్ణయించినట్లు ప్రచారం సాగుతోంది. అయితే మరీ ఇంతతక్కువా అంటూ కొందరు జడ్పీటీసీ సభ్యులు నసుగుతున్నట్లు తెలుస్తోంది. టీడీపీ పోటీలో దిగితే రెండో విడతలో మరింత సమర్పించు కుంటారని చెబుతున్నట్లు సమాచారం. మొత్తానికైతే జడ్పీ పీఠం ఏ మాత్రం చేజారినా రాజకీయంగా వైసీపీకి పెద్ద మైనస్ అవుతుందని భావిస్తున్నారు. ఇది సొంత జిల్లాలో తీవ్ర ప్రభావం చూపుతుందని ఆ పార్టీ పెద్దలు ఆందోళన చెందుతున్నారని అంటున్నారు.



మద్యం పరవళ్లు

- గ్రామాల్లో పుట్టగొడుగుల్లా బెల్టుషాపులు
- గోవా, కర్ణాటక, తెలంగాణ నుంచి మద్యం కొనుగోలు
- స్థానికంగా అధిక రేట్లకు అమ్మకాలు
- తూతూమంత్రంగా ఎస్ఈబీ అధికారుల తనిఖీలు

పులివెందుల టౌన్, ఆగస్టు 29: పులివెందుల ప్రాంతంలో మద్యం అక్రమ వ్యాపారం జోరుగా సాగుతోంది. ఇతర రాష్ట్రాలకు చెందిన మద్యం విచ్చలవిడిగా దిగుమతి అవుతోంది. కొంతమంది అక్రమార్కులు గోవా, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి మద్యాన్ని ఇక్కడకు తెచ్చి అధిక ధరలకు విక్రయించి సొమ్ముచేసుకుంటున్నారు. ఇక్కడి కంటే అక్కడి ధరలు తక్కువగా ఉన్నందున అక్రమార్కులకు ఈ వ్యాపారం కల్పవృక్షంగా మారింది. కొంతమంది గోవా వెళ్లి నేరుగా మద్యాన్ని కొని తెచ్చుకుంటున్నారు. కొంతమంది అక్కడే ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని వారి ద్వారా మద్యం తెప్పిస్తున్నారు. కొద్ది నెలల క్రితం హర్యానా నుంచి పులివెందులకు అక్రమంగా తెచ్చిన మద్యం పట్టుబడింది. అలాగే పోలీసు ఉన్నతాధికారులు తనిఖీల్లో భారీగా మద్యం దొరకడం తెలిసిందే. ఆ సమయంలో కొంతమంది అక్రమార్కులపై ఎక్సైజ్, పోలీసు అధికారులు కేసులు నమోదు చేశారు. ఆ తర్వాత పట్టించుకోకపోవడంతో మళ్లీ ఈ అక్రమ వ్యాపారం యథేచ్ఛగా సాగుతున్నట్లు తెలిసింది.



విచ్చలవిడిగా బెల్టుషాపులు

ఇతర రాష్ట్రాల నుంచి మద్యం తెచ్చి కొందరు విక్రయిస్తుండగా.. మరికొందరు ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి బాటిళ్లను కొనుగోలు చేసి గ్రామాలకు తరలించి విక్రయిస్తూ సొమ్ముచేసుకుంటున్నారు. ఈ అక్రమ వ్యాపారం మంచి ఆదాయ వనరుగా మారడంతో గ్రామాలలో బెల్టుషాపులు పుట్టగొడుగుల్లా వెలిశాయి. ప్రతి గ్రామంలో బెల్టుషాపు నిర్వహిస్తున్నారు. కొంచెం పెద్ద గ్రామాలలో అయితే మూడు నాలుగు చోట్ల షాపులు నడుస్తుండడం గమనార్హం. మొత్తమ్మీద పులివెందుల ఎక్సైజ్ పరిధిలో గ్రామాలలో విచ్చలవిడిగా మద్యం విక్రయిస్తున్నారు. ఒక్కో బెల్టుషాపులో రోజుకు రూ.5వేల నుంచి రూ.10వేల వరకు మద్యం విక్రయిస్తున్నారు. ఈ లెక్కన పులివెందుల పరిధిలో లక్షల్లో మద్యం విక్రయస్తున్నారు. ప్రభుత్వ మద్యం షాపుల్లోని సిబ్బంది, బెల్టుషాపుల నిర్వాహకులతో కుమ్మక్కై ఈ అక్రమ వ్యాపారం సాగిస్తున్నారని సమాచారం. దీంతో గ్రామాలలో ఏ సమయంలో కావాలన్నా మందు దొరుకుతోంది.

పట్టించుకోని ఎక్సైజ్‌శాఖ

గ్రామాలలో విచ్చలవిడిగా బెల్టుషాపులు నిర్వహిస్తున్నా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో అక్రమ మద్యం వ్యాపారం విచ్చలవిడిగా సాగుతోంది. గ్రామాలలో బెల్టుషాపులు పుట్టగొడుగుల్లా వెలుస్తుండడంతో తరచూ గొడవలు జరుగుతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. మద్యం నిత్యం అందుబాటులో ఉండడంతో యువత మద్యం సేవించి గొడవలు పడుతున్నారు. విచ్చలవిడిగా తాగి వాహనాలు నడుపుతూ ప్రమాదాల బారినపడుతున్నారు. ఎవరైనా ఫిర్యాదుచేస్తే గొడవకు దిగుతున్నారు. ఇక పలుచోట్ల సారా విక్రయాలు కూడా జరుగుతున్నాయి. కొందరు తయారు చేస్తుంటే, కొందరు పొరుగు నుంచి తెచ్చుకొని విక్రయిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అక్రమమద్యం, సారా వ్యాపారాన్ని అరికట్టకపోతే గ్రామాలలో శాంతిభద్రతల సమస్య ఉత్పన్నమయ్యే పరిస్థితి ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఎక్సైజ్, పోలీసు ఉన్నతాధికారులు స్పందించి బెల్టుషాపులను నిర్మూలించాలని డిమాండ్ చేస్తున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు..

నిబంధనలకు విరుద్ధంగా గ్రామాలలో, పట్టణాలలో మద్యం విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటాం. కొద్ది నెలలుగా బెల్టుషాపులపై కేసులు పెడుతున్నాం. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన మద్యాన్ని పట్టుకొని కేసులు నమోదు చేశాం. అక్రమంగా మద్యం, సారా విక్రయిస్తుంటే ప్రజలు సమాచారం ఇవ్వాలని కోరుతున్నాం. సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.

- సబితారెడ్డి, సీఐ, ఎస్ఈబీ, పులివెందుల

భారీగా మద్యం పట్టివేత

- గోవా నుంచి తరలిస్తున్న మద్యంగా గుర్తింపు



మద్యంతో సహా పట్టుబడ్డ వాహనాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ మురళీనాయక్

పులివెందుల టౌన్, ఆగస్టు 29: పట్టణంలోని కదిరి రోడ్డులో ఐచర్ వాహనంలో భారీ మొత్తంలో అక్రమంగా తరలిస్తున్న మద్యంను డీఎస్పీ మురళీనాయక్ ఆధ్వర్యంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ అక్రమ మద్యం గోవా నుంచి అక్రమంగా తరలిస్తున్నట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. రెండు ఐచర్ వాహనాల ద్వారా అక్రమ మద్యంను తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో... రింగురోడ్డు వద్దకు చేరుకొని.. నిఘా పెట్టగా.. ఒక ఐచర్ వాహన పట్టుబడింది. అయితే అప్పటికే మరో ఐచర్ వాహనం, మూడు వాహనాలు మిస్ అయి కడప రోడ్డుకు వెళ్లినట్లు సమాచారం. పట్టుడిన ఐచర్ వాహనంలో వివిధ బ్రాండ్లకు చెందిన మద్యంతో నిండి ఉండగా.. దానిపై ప్లైవుడ్ షీట్లుపెట్టి తరలిస్తున్నట్లు పోలీసు అధికారులు గుర్తించారు. వాహనంతో పాటు డ్రైవర్‌ను, క్లీనర్‌ను అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నారు. దీనిపై పూర్తి విచారణ చేసి నిందితులపై చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు చెబుతున్నారు.

పోలీసు సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి : ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

కడప (క్రైం), ఆగస్టు 29: ఉద్యోగ రీత్యా విధుల్లో ఉండే పోలీసు సిబ్బంది తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు సూచించారు. గురువారం పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు జిల్లా పోలీసు సంక్షేమ ఆసుపత్రిలో జైడస్ హెల్త్‌కేర్ వారి సహకారంతో ఏర్పాటు చేసిన అత్యాధునిక లివర్ ఫైబ్రో స్కాన్ (కాలేయ పనితీరు) పరీక్షలను ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సంక్షేమంలో భాగంగా ఖరీదైన లివర్ ఫైబ్రో స్కాన్ పరీక్షలను ఉచితంగా అందిస్తున్నారని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సెప్టెంబరు 3,4 తేదీల్లో విజయవాడ మణిపాల్ హాస్పిటల్ వైద్యుల పర్యవేక్షణలో 45 సంవత్సరాలు నిండి వివాహమై 20 సంవత్సరాలు అయిన మహిళా పోలీసు సిబ్బందికి, వారి కుటుంబంలో మహిళలకు ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్ఎస్‌వీ క్రిష్ణారావు, పోలీసు సంక్షేమ వైద్యశాల వైద్యురాలు డాక్టర్ మేరీ సుజాత, ఆర్ఐలు ఆనంద్, శ్రీశైలరెడ్డి, టైటస్, వీరేశ్, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పుశంకర్, పోలీసు సంక్షేమ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

తేనె కన్నా తీయనిది అమ్మభాష : వీసీ



వక్తలను సత్కరిస్తున్న వైస్‌చాన్సలర్, రిజిస్ట్రారు తదితరులు

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 29 : తేనె కన్నా తీయనైనిది అమ్మభాష అని వైవీయూ వైస్‌చాన్సలర్ క్రిష్ణారెడ్డి అన్నారు. గురువారం వైవీయూలో తెలుగుశాఖాధిపతి పార్వతి అధ్యక్షతన తెలుగు భాష దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ శాస్త్ర సాంకేతికతను తెలుగుశాఖ అందిపుచ్చుకుని అభివృద్ధి దిశగా వెలుగుతుండడం సంతోషకరమన్నారు. రిజిస్ట్రారు రఘునాథరెడ్డి మాట్లాడుతూ గిడుగు రామమూర్తి పంతులు తెలుగుభాషకు చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ప్రత్యేక న్యాయాధికారి పసుపులేటి శంకర్ మాట్లాడుతూ ప్రపంచ భాషల్లో తెలుగుభాష గొప్పదన్నారు. అనంతరం డాక్టర్ అంచె శ్రీనివాస్, తెలుగుశాఖ ప్రొఫెసరు తప్పెట రాంప్రసాద్‌రెడ్డి, రమాదేవి, ఎంఎం వినోదిని, ఆర్ట్స్ విభాగం డీన్ ప్రొఫెసరు గంగయ్యలు పాల్గొన్నారు. వక్తలను ఘనంగా సత్కరించారు.

గురుకుల విద్యాలయాల్లో బెస్ట్‌టీచర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 29 : ఉమ్మడి కడప జిల్లాలో గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ఖాళీగా ఉన్న బెస్ట్‌టీచరు పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కోఆర్డినేటరు మాధవీలత ప్రకటనలో తెలిపారు. కడప, అన్నమయ్య జిల్లాల పరిధిలో ఉన్న లక్కిరెడ్డిపల్లె సీబీటీ నేషనల్ ఫిజికల్ ఎడ్యుకేషన్, మడకలవారిపల్లె సీబీటీ ఫిజికల్ సైన్స్, వాల్మీకిపురం ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచరు, సీబీటీ ఎడ్యుకేషన్ సైన్స్ మేథమేటిక్స్ బోధించేందుకు అతిథి టీచర్ల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. పీజీటీ, ఫిజికల్ సైన్స్‌కు దరకాస్తు చేసుకునే అభ్యర్థులకు పీజీలో ఫిజికల్ సైన్స్, కెమిస్ట్రీ ఉండాలని.. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టుల్లో డిగ్రీ, పీజీ, బీఈడీ మెథడాలజీ సెట్ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 31వ తేదీలోగా జిల్లా కోఆర్డినేటరు గురుకుల సొసైటీ, కడప కలెక్టరేట్ కార్యాలయానికి స్వయంగా దరఖాస్తులు అందించాలని సూచించారు. పోస్టుద్వారా పంపే దరఖాస్తులు స్వీకరించరన్నారు. డిగ్రీ, పీజీలో ఇంగ్లీషు మీడియంలో చదివిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఇతర వివరాలకు ఫోను నెంబర్లు మడకలవారిపల్లె 9704550131, వాల్మీకిపురం 7093323208, లక్కిరెడ్డిపల్లె 9704550132 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

రాష్ట్ర మంత్రులను కలిసిన హరిప్రసాద్



మంత్రి రామానాయుడిని కలిసిన హరిప్రసాద్

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 29: రాష్ట్ర సచివాలయంలో గురువారం మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. కడప జిల్లాకు సంబంధించి ఆయనతో చర్చించారు. అనంతరం ఇరిగేషన్ మంత్రిని కూడా కలిశారు. ఈసందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ సెప్టెంబరు 22న కడపలో జరిగే బలిజ ఆత్మీయ సమావేశానికి మంత్రులు నారాయణ, కందుల దుర్గేష్, నిమ్మల రామానాయుడు, శ్రీనివాస్‌లను ఆహ్వానించినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మండిబాబు, బండారు సత్య, కట్టా నారాయణ, విజయభాస్కర్ పాల్గొన్నారు.

ఏఐఆర్ఎన్‌డబ్ల్యుఎల్‌సీ పోటీలలో ప్రతిభ చాటిన శివరామకృష్ణ



కడప (స్పోర్ట్స్), ఆగస్టు 29: ముంబయి నగరంలో ఈనెల 26 నుంచి జరిగిన ఆల్ ఇండియా రైల్వే నేషనల్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ (ఏఐఆర్ఎన్‌డబ్ల్యుఎల్‌సీ) పోటీలలో కడప నగరం ఉక్కాయపల్లెకు చెందిన ఎ.శివరామకృష్ణయాదవ్ (గుంటూరు రైల్వే ఉద్యోగి-టీసీ) 89 కేజీల విభాగంలో పాల్గొని రజత పతకం సాధించారు. వెస్ట్రన్ రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో శివరామకృష్ణ స్నాచ్‌లో 140 కేజీలు, అలాగే క్లీన్ అండ్ జెర్క్‌లో 174 కేజీలు మొత్తంగా 314 కేజీల బరువును సునాయాసంగా ఎత్తి సిల్వర్ మెడల్ సాధించారు. ప్రస్తుతం గుంటూరు రైల్వేలో టీసీగా ఉద్యోగం చేస్తున్న శివరామకృష్ణ సౌత్ సెంట్రల్ రైల్వే సీనియర్ కోచ్ ఖాదర్‌బాష వద్ద శిక్షణ పొందుతున్నారు. కాగా, మున్ముందు సౌత్ సెంట్రల్ రైల్వే తరఫున మరిన్ని పోటీలలో పాల్గొని విజేతగా నిలిచి పతకాలు సాధించాలని రైల్వే సిబ్బందితో పాటు పలువురు జిల్లా క్రీడాకారులు ఆకాంక్షిస్తున్నారు.

ఎన్‌బీయూ ద్వారా మెరుగైన జీవనోపాదులు



సమావేశంలో మాట్లాడుతున్న మెప్మా పీడీ సురేశ్‌రెడ్డి

కడప (ఎన్టీఆర్ సర్కిల్), ఆగస్టు 29: నైబర్ వుడ్ బిజినెస్ యూనిట్ (ఎన్‌బీయూ) ద్వారా స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులకు మెరుగైన జీవనోపాధులు లభ్యమవుతాయని మెప్మా పీడీ సురేశ్‌రెడ్డి పేర్కొన్నారు. మెప్మా మిషన్ డైరెక్టరు ఆదేశాల మేరకు గురువారం మెప్మా కార్యాలయం లో పట్టణ స్థాయి మెప్మా అధికారులకు వికసిత్ ఏపీ అర్థరేటాఫ్ 2047 అంశంపై వర్క్‌షాపు నిర్వహించారు. ఈ వర్క్‌షాపులో మెప్మా ప్రాజెక్టు డైరెక్టరు మాట్లాడుతూ వికసిత్ ఏపీ అర్థరేటాఫ్ 2024లో భాగంగా ఏపీ ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలకు జీవనోపాధులు మెరుగపడడానికి ఏపీ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు, నైబర్‌హుడ్ బిజినెస్ యూనిట్స్‌పై అవగాహన కల్పించాలన్నారు. ఇందుకనుగుణంగా వారికి శిక్షణ ఇచ్చి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. తద్వారా వారి జీవన విధానాన్ని మెరుగుపరచాలని తెలిపారు. అలాగే భారత ప్రభుత్వం ప్రారంభిస్తున్న ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్‌పై అవగాహన కల్పించాలన్నారు. ఇందులో భాగంగా స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారీ చేసే ఉత్పత్తులు దేశవ్యాప్తంగా అమ్మవచ్చు, కొనవచ్చు అని వివరించారు. ప్రతి మున్సిపాలిటీలో సంఘ సభ్యులు తయారు చేస్తున్న ఉత్పత్తుల్లో నాణ్యమైన, జీఎస్టీ బ్రాండింగ్ ఉన్నవాటికి ఈ ఆర్థిక సంవత్సరానికి ప్రతి మున్సిపాలిటీలో 10 యూనిట్లకు, కడప కార్పొరేషన్‌లో 30యూనిట్లకు ఓఎన్‌డీసీలో ఆన్-బోర్డు చేయాలని వివరించారు. జిల్లా ఇనిస్టిట్యూషన్ బిల్డింగ్ ఎల్‌హెచ్ నాగరాజు, వివిధ మున్సిపాలిటీల మెప్మా అధికారులు పాల్గొన్నారు.

క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలి : కలెక్టర్



కోటిరెడ్డి సర్కిల్ వద్ద ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్

కడప (స్పోర్ట్స్), ఆగస్టు 29 : క్రీడల వల్ల భౌతిక వికాసం, దేహదారుఢ్యం పెరుగుతుందని.. ప్రతి ఒక్కరూ ఏదో ఒక క్రీడను జీవితంలో భాగంగా పెట్టుకోవాలని కలెక్టర్ లోతేటి శివశంకర్ అన్నారు. గురువారం స్థానిక డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ మైదానంలో హాకీ దిగ్గజం ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా నేషనల్ స్పోర్ట్స్‌డేలో భాగంగా వివిధ రకాల క్రీడాకారులకు పోటీలను నిర్వహించి.. బహుమతులు ప్రదానం చేశారు. స్థానిక కోటిరెడ్డి సర్కిల్ వద్ద కలెక్టరు చేతుల మీదుగా 3 కి.మీ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ కోటిరెడ్డిసర్కిల్ నుంచి ఏడురోడ్లు, పాతరిమ్స్ సర్కిల్, శ్రీకృష్ణదేవరాయ విగ్రహం మీదుగా డీఎస్ఏ స్టేడియం వరకు కొనసాగింది. అనంతరం హాకీ దిగ్గజం ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులను శాలువాతో సత్కరించి జ్ఞాపికలను కలెక్టరు చేతు ల మీదుగా అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్రీడాకారులనుద్దేశించి మాట్లాడుతూ యువత, విద్యార్థులు క్రీడల్లో మెలకువలను తెలుసుకుని రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రాణించి జిల్లాకు, రాష్ట్రానికి దేశానికి మంచి పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో డీఎస్‌డీవో జగన్నాథ్‌రెడ్డి, స్టెప్ సీఈవో సాయిగ్రేస్, వివిధ క్రీడాకారులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ లక్ష్యాలను అధిగమించాలి



మాట్లాడుతున్న అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), అగస్టు 29: గృహ నిర్మాణ పథకంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలని అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి హౌసింగ్ అధికారులను అదేశించారు. గురువారం రాయచోటి కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పేదలందరికీ గృహ నిర్మాణ పథకంపై అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు.. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేదలందరికీ సొంతింటి కల సాకారం చేసే విధంగా ఇప్పటికే మంజూరైన గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణాలలో ఎటువంటి రాజీ లేకుండా నాణ్యతగా చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇసుక పాలసీకి లోబడి ఇసుక సరఫరా చేయడం జరుగుతుందన్నారు. వివిధ దశల్లో జరుగుతున్న గృహ నిర్మాణాలను క్షేత్రస్థాయిలో అధికారులు పర్యవేక్షించి నాణ్యతగా చేపట్టేలా చూడాలన్నారు. కాలనీలలో కావల్సిన మౌలిక సదుపాయాలపై ఎంపీడీవోలు, కమిషనర్లు, హౌసింగ్ అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. రాజంపేటలోని బోడిగుంటపల్లిలో ఇసుక రెండు రోజుల్లో అందుబాటులోకి వస్తుందన్నారు. జిల్లాలో 46 వేల మెట్రిక్ టన్నుల ఇసుక అవసరమని అంచనా వేశామన్నారు. ఇళ్ల నిర్మాణాల బిల్లులకు సంబంధించి కొంతమందికి అకౌంట్లలో పడడం లేదని తమ దృష్టికి వచ్చిందని, ఆధార్‌సీడింగ్ సరిచూసుకుని బిల్లులు వారి అకౌంటుకు వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాకు 78221 ఇళ్లు కేటాయించారని, వీటిలో 82 శాతం పనులు మొదలు పెట్టారని.. మిగిలినవి కూడా త్వరలో పూర్తి చేయాలని అదేశించారు. జాయింట్ కలెక్టర్ అదర్శ రాజేంద్రన్, మదనపల్లి, రాజంపేట, సబ్‌కలెక్టర్లు మేఘ స్వరూప్, నదియాదేవి తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ అసిస్టెంట్ల కౌన్సెలింగ్‌కు 166 మంది హాజరు



డీపీఆర్‌సీ భవనంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీపీవో

కడప రూరల్, ఆగస్టు 29: కడప, అన్నమయ్య జిల్లాలలోని ఆయా గ్రామ సచివాలయాలలో పనిచేస్తు బదిలీలకు దరఖాస్తు చేసుకున్న డిజిటల్ అసిస్టెంట్లకు గురువారం జడ్పీ ఆవరణలోని డీపీఆర్‌సీ భవనంలో కౌన్సెలింగ్ నిర్వహించినట్లు డీపీవో ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. వైఎస్ఆర్ కడప జిల్లా నుంచి 111 మం ది, అన్నమయ్య జిల్లా నుంచి 67 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. కౌన్సెలింగ్‌కు కడప జిల్లా నుంచి 106 మంది, అన్నమయ్య జిల్లా నుంచి 60 మంది హాజరైనట్లు తెలిపారు. బదిలీలకు సంబంధించి దరఖాస్తులతో పాటు, నేడ్యూస్, స్పౌస్, మెడికల్ సర్టిఫికెట్లను పరిశీలించామన్నారు. సెప్టెంబర్ 1న చేపట్టే పించన్ల పంపిణీ అనంతరం బదిలీలకు సంబంధించిన ఆర్డర్‌ను డిజిటల్ అసిస్టెంట్లకు ఇస్తామని తెలిపారు. అలాగే ఈనెల 30న గ్రేడ్-5 సెక్రటరీలకు సంబంధించిన బదిలీల కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ కార్యాలయం ఏవో ఖాదర్‌బాషా, జడ్పీ కడప డీఎల్‌డీవో వెంకటసుబ్బయ్య, డీఎల్‌పీవోలు మస్తాన్‌వల్లి, రమణారెడ్డి, సురేష్, డీపీఆర్‌సీ కో-ఆర్డినేటర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు కౌన్సెలింగ్

కడప రూరల్, ఆగస్టు 29 : పంచాయతీరాజ్‌శాఖ పరిధిలోని గ్రేడ్-2 ఇంజనీరింగ్ అసిస్టెంట్ల బదిలీలకు సంబంధించిన కౌన్సెలింగ్‌ను శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి కడప నగరం నాగరాజుపేటలోని జిల్లా పంచాయతీరాజ్ కార్యాలయంలో ప్రారంభమవుతుందని పీఆర్ ఎస్ఈ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఉమ్మడి కడప జిల్లా పరిధిలోని 610 సచివాలయాలల నుంచి 135 మంది ఇంజనీరింగ్ అసిస్టెంట్లు బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. బ్యాలెన్స్ పద్ధతిన బదిలీలు జరుగుతాయన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు మ్యూచువల్, స్పౌస్, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. బదిలీలకు దరఖాస్తు చేసుకున్న వారందరు సకాలంలో కౌన్సెలింగ్ ప్రక్రియకు హాజరు కావాలని తెలిపారు.

గండికోట నుంచి మైలవరానికి నీరు విడుదల



కొండాపురం, ఆగస్టు 29: గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయానికి గురు వారం నీరు విడుదల చేశారు. గండికోటప్రాజెక్టు వద్ద గేట్లు ఎత్తి 7500 క్యూసెక్కుల చొప్పున మైలవరానికి నీరు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. సీబీఆర్‌కు 1000 క్యూసెక్కులు, పైడిపాలెం రిజర్వాయర్‌కు 800 క్యూసెక్కులు, వామికొండ, సర్వరాయ సాగర్‌కు 500 క్యూసెక్కుల చొప్పున గండికోట ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. కాగా ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 18.8 టీఎం సీల నీరు నిల్వ ఉంది.

'చలో ఎస్పీడీసీఎల్'ను జయప్రదం చేయండి

కడప (నాగరాజుపేట), ఆగస్టు 29 : విద్యుత్ కార్మికుల సమస్యలపై సెప్టెంబరు 5న తిరుపతిలో ఎస్పీడీసీఎల్ వద్ద జరిగే 'చలో ఎస్పీడీసీఎల్' ఆందోళనలను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు కామనూరు శ్రీనివాసులరెడ్డి కోరారు. గురువారం ఉదయం నగరంలోని విద్యుత్ భవన్‌లో వారు సీఐటీయూ ఆధ్వర్యంలో విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చలో తిరుపతికి పిలుపునిచ్చారు. అందుకు సంబంధించి వాల్ పోస్టర్‌ను విడుదలచేశారు. కావున ఉమ్మడి జిల్లాలోని విద్యుత్ కార్మికులందరూ ధర్నాకు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శివశంకర్, ఏపీ ట్రాన్స్‌కో నాయకులు నూర్‌బాషా, కడప డివిజన్ నాయకులు శివప్రసాద్‌రెడ్డి, దేవదానం విద్యుత్ కార్మికులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ వీసీని తొలగించాలి: ఏఐవైఎఫ్

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 29 :అవినీతి అక్రమాలకు పాల్పడిన వైవీయూ ఇన్‌చార్జ్ వీసీ క్రిష్ణారెడ్డిని తొలగించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్‌బాబు, సహాయ కార్యదర్శి గంగాసురేశ్ కోరారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో మంత్రి సత్యప్రసాద్, ఉన్నత విద్య ప్రిన్సిపాల్ సెక్రటరీ సౌరబ్‌గౌర్ విద్యాశాఖ మంత్రి ఓఎస్డీ వెంకటరమణను కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ గతంలో క్రిష్ణా యూనివర్సిటీలో అవినీతి అక్రమాలకు పాల్పడి గెస్ట్‌హౌస్‌లోనే అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడ్డారని ఆరోపించారు. విచారణ జరిపించి ఇన్‌చార్జ్ వీసీని తొలగించి రెగ్యులర్ వీసీని నియమించాలని డిమాండ్ చేశారు.

పంట నమోదుతో పథకాలు వర్తింపు

పెండ్లిమర్రి, ఆగస్టు 29: సాగులో ఉన్న పంటను పంట నమోదు చేసుకుంటేనే ప్రభుత్వం వచ్చే పథకాలు వర్తిస్తాయని జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని మిట్టమీదపల్లె గ్రామంలో పత్తి,సజ్జపంట నమోదు కార్యక్రమాన్ని మండల వ్యవసాయాధికారి జి.పి.ఓబులేసుతో కలిసి జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరారవు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పంట నమోదుచేసుకుంటే పంట నష్టపరిహారం, క్రాప్ ఇన్సూరెన్స్, సున్న వడ్డీ పంటరుణాలు వర్తిస్తాయన్నారు. ఇప్పటి వరకు మండలంలో వరి 548హెక్టార్లు, కొర్ర 133, పత్తి 282, వేరుశనగ 43, ఉల్లి 143, మినుము 82 సాగులో ఉన్నాయన్నారు. రైతు శిక్షణ కేంద్రం వ్యవసాయాధికారి నాగభూషణ్‌రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకురాలు నాగలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

మేయరు ఇంట్లో చెత్త వేయాలంటూ ప్రేరేపించిన స్టాఫ్ రిపోర్టర్‌పై కేసు నమోదు

కడప (క్రైం), ఆగస్టు 29 : కడప నగర మేయర్ ఇంట్లో చెత్త వేయాలంటూ టీడీపీ శ్రేణులను ప్రేరేపించిన మీడియా చానల్ స్టాఫ్ రిపోర్టర్‌పై కేసు నమోదు చేసినట్లు చిన్నచౌకు పోలీసులు తెలిపారు. రెండురోజుల క్రితం టీడీపీ శ్రేణులతో పాటు నగర మేయర్ ఇంటి వద్ద చెత్త సేకరరించి ఆందోళన చేశారు. ఆ సమయంలో ఒక మీడియా స్టాఫ్ రిపోర్టర్ బొమ్మలాట మధుసూదన్ అక్కడికి చేరుకుని వార్త సేకరిస్తున్నట్లుగా ఉంటూ అక్కడ ఉన్న వారిని మేయరు ఇంట్లో చెత్త వేయాలని చెప్పడంతో వారు చెత్తను మేయరు ఇంట్లో పడేశారు. ఈ మేరకు మధుసూదన్‌పై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అగ్నిమాపక సిబ్బంది ఎన్నికల్లో 'కడప' గెలుపు

కడప (క్రైం), ఆగస్టు 29 :గుంటూరులో బుధవారం జరిగిన రాష్ట్ర ఎన్నికల్లో కడప జిల్లాకు చెందిన షేక్ నూర్ మహబూబ్‌బాషా క్రీడలు, సాంస్కృతిక శాఖ కార్యదర్శిగా, రవీంద్రరెడ్డి ఉపాధ్యక్షుడుగా ఎన్నికయ్యారు. నూర్ మహబూబ్‌బాషా మాట్లాడుతూ సిబ్బంది సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తామని అన్నారు, తన గెలుపునకు కారణం అయిన కడప జిల్లా సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

రేపు పింఛన్‌దారులు అందుబాటులో ఉండాలి

సింహాద్రిపురం, ఆగస్టు 29: పింఛనుదారులు ఈ నెల 31వ తేదీన మీ ఇంటి వద్ద అందుబాటులో ఉండాలని ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. సెప్టెంబరు 1వ తేదీ ఆదివారం సెలవు దినం కావడంతో పింఛన్లు అందించడం వీలుకాదని, ప్రభుత్వం ఈ నెల 31నే అందించాలని ఆదేశాలు జారీ చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు.

ఘనంగా గురివిరెడ్డి స్వామి ఆరాధనోత్సవాలు

వేంపల్లె, ఆగస్టు 29: వేంపల్లె మండలంలోని తాటిమాకులపల్లె గ్రామంలో గురివిరెడ్డిస్వామి ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆశ్రమ కమిటీ ఆధ్వర్యంలో స్వామి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున చుట్టుపక్కల గ్రామాల్లోని భక్తులు స్వామివారిని దర్శించుకొన్నారు. ఎద్దుల పోటీలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఎద్దులతో పోటీలు నిర్వహించారు. రాజ్యసభ మాజీ సభ్యులు తులసిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు గురివిరెడ్డిస్వామిని దర్శించుకున్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలి

సీకేదిన్నె, ఆగస్టు 29: ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని పెంచడంలో శ్రద్ధ వహించాలని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ వీరయ్య తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రంలో గురువారం ప్రధానమంత్రి తల్లిపేరుతో చెట్టు కార్యక్రమంలో భాగంగా చెట్లు పెంచే కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెట్లు పర్యావరణానికి ఎంతగానో ఉపయోగపడుతాయని, వాటిని ప్రతి ఒక్కరు ఒక యజ్ఞంలాగా చేపట్టి చెట్లను పెంచాలన్నారు.

పంట నమోదును పరిశీలించిన ఏఓ

వేముల, ఆగస్టు 29: గొందిపల్లె రెవిన్యూ గ్రామంలో పంట నమోదును మండల వ్యవసాయాధికారి చెన్నారెడ్డి గురువారం పరిశీలించారు. ఆయన ఆమట్లాడుతూ ఇప్పటి వరకు పదివేల ఎకరాలలో పంట న మోదు అయినట్లు తెలిపారు. మిగిలిన రైతులు త్వరగా పంటన మోదు చేసుకోవాలని తెలిపారు. రైతు సేవా కేంద్రాలలో డీఏపీ, వైట్ పొటాష్, కాంప్లెక్స్ ఎరువులు ఉన్నాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తెలుగు భాషోద్ధారకుడు గిడుగు రామమూర్తి



వల్లూరు: గిడుగు, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



పులివెందుల: మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతులమీదుగా బహుమతులు అందుకున్న విద్యార్థులు



సింహాద్రిపురం: అంకాళమ్మగూడూరులో తెలుగు పండిట్‌ను సన్మానిస్తున్న టీచర్లు

వేంపల్లె, ఆగస్టు 29: తెలుగు భాషోద్ధారకుడు గిడుగు రామమూర్తి అని రాజ్యసభ మాజీ సభ్యుడు తులసిరెడ్డి అన్నారు. గురువారం గిడుగు రామమూర్తి పంతులు జయంతిని తెలుగు భాషా దినంగా వేంపల్లెలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ గిడుగు తన జీవితమంతా తెలుగు భాషోద్ధరణకు కృషిచేశారని, అందుకే ఆయన పుట్టిన రోజైన ఆగస్టు 29ని తెలుగు భాషా దినంగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. సుదీర్ఘ ప్రస్థానం కలిగిన అతి ప్రాచీనమైన భాష తెలుగు అన్నారు. గిడుగు రామమూర్తి తెలుగును గ్రాంధికం నుంచి వ్యావహారిక భాషలోకి తెచ్చి అందరికీ అందుబాటులోకి తెచ్చారన్నారు. పాఠశాల విద్యలో తెలుగు మాధ్యమాన్ని రద్దుచేస్తూ గత వైసీపీ ప్రభుత్వం 2019 నవంబరు 20వ తేదీన జీఓ 85జారీ చేయడం చారిత్రక తప్పిదమన్నారు. గత వైసీపీ ప్రభుత్వం జారీ చేసిన జీఓను రద్దు చేసి రాష్ట్రంలో ప్రాథమిక విద్యను మాతృభాష అయిన తెలుగు మాధ్యమంలో కొనసాగించాలని తులసిరెడ్డి విజ్ఞప్తిచేశారు. కాంగ్రెస్ నాయకులు సుబ్రమణ్యం, రామకృష్ణ, బాబు, అమర్‌నాథ్‌రెడ్డి, ఉత్తన్న, బాలం సుబ్బరాయుడు, వేమారాజా, వినయ్, వేమయ్యమదార్ పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవ వేడుకలు

వల్లూరు, ఆగస్టు 29 : తెలుగు భాషా దినోత్సవ వేడుకలను వల్లూరులోని జిల్లా పరిషత్ హైస్కూలు హెచ్‌ఎం శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు రామమూర్తి చిత్రపటానికి, అలాగే క్రీడాదినత్సోవం సందర్భంగా ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ తెలుగుజాతి గర్వించదగ్గట్టుగా రామమూర్తి ఎనలేని సేవలు అందించారన్నారు. అలాగే క్రీడాభివృద్ధికి ధ్యాన్‌చంద్ ఎనలేని సేవలందించారన్నారు. గొప్పక్రీడాస్ఫూర్తి గల వ్యక్తి అని అన్నారు. ఈ కార్యక్రమంలో పీఈటీ తిరుపాల్‌రెడ్డి, పాఠశాల కమిటీ ఛైర్మన్ మోహన్, తెలుగుభాషా ఉపాధ్యాయుడు శ్యామ్‌సుందర్ తదితరులు పాల్గొన్నారు.

వెంకయ్య నాయుడి చేతులమీదుగా విద్యార్థులకు బహుమతులు

పులివెందుల, ఆగస్టు 29: తొండూరు మండలం అగడూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ చూపి మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు చేతులమీదుగా బహుమతులు అందుకున్నారు. గురువారం తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా యర్రగుంట్ల మండలం కల్లమల్ల గ్రామంలో జరిగిన కార్యక్రమానికి మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా స్థాయిలో జరిగిన పోటీలలో అగడూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు వై.అపూర్వ పద్యపఠన విభాగంలో రెండవస్థానం, వకృత్వ పోటీలలో గంగా శ్రీవిద్య మూడవ స్థానంలో నిలిచారు. వీరికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్, ప్రధానోపాధ్యాయులు సి.బాబురెడ్డ, సిబ్బంది పాల్గొన్నారు.

సింహాద్రిపురంలో...

అంకాళమ్మగూడూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా మాతృభాషా దినోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు వివిధ అంశాలలో పోటీలు నిర్వహించి విజేతలకు ప్రధానోపాధ్యాయుడు భాస్కర్ చేతుల మీదుగా బహుమతులు పంపిణీ చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, స్వీట్లు పంపిణీ చేశారు. హెచ్‌ఎం భాస్కర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు, మాతృభాషకు ఒకే గౌరవం ఇవ్వాలి

పులివెందుల రూరల్, ఆగస్టు 29: తల్లిదండ్రులకు ఎంత గౌరవాన్ని ఇస్తామో మాతృభాషకు అదే గౌరవం ఇవ్వాలని ఇస్లాంపురం జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు సుధాకర్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక హైస్కూల్‌లో తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా గిడుగు రామమూర్తికి, జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు విద్యార్థులతో కలిసి పూలమాల వేసి ఘననివాళులర్పించారు.

ఆంధ్రలో తెలుగు విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయండి

కడప (ఎన్టీఆర్ సర్కిల్), ఆగస్టు 29 : తెలంగాణలోని తెలుగు విశ్వవిద్యాలయం మాదిరిగా ఆంధ్రప్రదేశ్‌లోనూ తెలుగు విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని ప్రముఖ రంగస్థల నటుడు, రచయిత కడియంపాటి అరుణ్‌ప్రసాద్ పేర్కొన్నారు. తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం విలేకరులతో మాట్లాడారు. ప్రపంచంలోనే అతి ప్రాచీనమైన భాష తెలుగును కాపాడుకోవాల్సిన బాధ్యత తెలుగువారందరిపై ఉందన్నారు. ఆంగ్లభాష మోజులో పడి తెలుగు కనుమరుగవుతోందన్నారు.

వైభవంగా తెలుగు భాషా దినోత్సవం

వేంపల్లె, ఆగస్టు 29: మండలంలోని పలు విద్యాలయాల్లో తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. చైతన్య హైస్కూల్లో కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి, డైరెక్టర్లు చేతన్‌రెడ్డి, చైతన్య ఆధ్వర్యంలో గిడుగు రామమూర్తి చిత్రపటానికి నివాళులర్పించారు. తెలుగుదనం ఉట్టిపడేలా పిల్లల వేషధారణ నారాయణ హైస్కూల్లో కరస్పాండెంట్ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ మాజీ సభ్యుడు తులసిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాష ఔన్నత్యం గురించి వివరించారు. కమ్మనైన అమ్మభాషగా పిలువబడే తెలుగు భాష ఎనలేనిదన్నారు. తేనెలొలుకు తెలుగువాడి తియ్యనైన భాష తెలుగు భాష అన్నారు. ప్రతి తెలుగు వాడూ సర్వ మానవాళికి తెలుగు భాష గొప్పతనాన్ని తెలియజెప్పి మన మాతృ భాష రుణం తీర్చుకోవాలని సూచించారు. అలాగే జిల్లా పరిషత్ బాలుర, బాలికల హైస్కూలు, ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో డైరెక్టర్ కుమారస్వామి గుప్త తెలుగు భాష ఉన్నతి గురించి తెలియజెప్పారు. పలుచోట్ల తెలుగు భాష దినోత్సవం నిర్వహించారు.



నారాయణ హైస్కూల్లో కరస్పాండెంట్ నారాయణరెడ్డి, తులసిరెడ్డి



వేంపల్లె చైతన్య హైస్కూల్లో విద్యార్థులతో కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి

ఘనంగా ఎమ్మెల్యే మాధవి పుట్టినరోజు వేడుకలు





ఎమ్మెల్యే పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేస్తున్న జనసేన నేత తుంగా రమణయ్య... అన్నదాన కార్యక్రమంలో టీడీపీ కువైట్ ఉపాధ్యక్షుడు షేక్ రహ్మతుల్లా

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 29 : కడప ఎమ్మెల్యే మాధవీ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం కడప నగరం విశ్వప్రగతి చిట్ ఫండ్స్ కార్యాలయంలో జనసేన నాయకులు తుంగా రమణయ్య ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఇందిరానగర్‌లో ఉన్న వృద్ధాశ్రమంలో అల్పాహారం ఏర్పాటు చేశారు. అంగడివీధిలో ఉన్న వికలాంగుల ఆశ్రమంలో అన్నదానం చేశారు. అనంతరం తుంగా రమణయ్య మాట్లాడుతూ కడప నియోజకవర్గంలో నిత్యం సమస్యలతో ఇబ్బందులు పడుతున్న ప్రజల సమస్యలను ప్రజలకందుబాటులో ఉంటూ పరిష్కారానికి ఎమ్మెల్యే చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. అందరినీ కలుపుకుని కడప అభివృద్ధికి పాటుపడుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు రవిశంకరరెడ్డి, జనసేన నాయకులు ఉంగరాల విజయ్, టీడీపీ నాయకులు మాజీ కార్పొరేటరు రాజగోపాల్‌రెడ్డి, చినబాబు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రహ్మతుల్లా ఆధ్వర్యంలో...

కడప నగరం ఆదరణ వృద్ధాశ్రమంలో ఎన్ఆర్ఐ టీడీపీ కువైట్ ఉపాధ్యక్షులు షేక్ రహ్మంతుల్లా ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మాధవీ జన్మదినాన్ని ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచారు. అలాగే అన్నదానం చేశారు. కర్యాక్రమంలో టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న గాజులపల్లె రాఘవేంద్ర

28వ డివిజనులో...

కడప నగరం 28వ డివిజను మున్సిపల్ ప్రైమరీ స్కూలు (శారదా నిలయం)డివిజన్ ఇన్‌చార్జ్ రాఘవేంద్ర ఆధ్వర్యంలో మొక్కలు నాటే కర్యాక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుండే మొక్కలు నాటే అలవాటు చేసుకోవాలన్నారు.

చెత్తకు నిప్పంటుకుని చెలరేగిన మంటలు

కడప (క్రైం), ఆగస్టు 29 : పాత రిమ్స్ అల్‌షిఫా స్కూలు వద్ద చెత్తకు నిప్పు అంటుకుంది. దీంతో ఫైర్ ఇంజన్ వారు వచ్చి ఆర్పేశారు. మున్సిపాలిటీ వారు చెత్త ఎత్తకపోవడంతో చెత్త పేరుకుపోతోందని, దీంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని స్థానికులు పేర్కొన్నారు.

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి: ఎంఈఓ

సీకేదిన్నె, ఆగస్టు 29: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని మండల విద్యాశాఖ అధికారి వెంకటరామిరెడ్డి తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం అంగడివీధి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వివిద పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. బహుమతులను రిటైర్డు ప్రధానోపాధ్యాయులు సుజాత అందించడం జరిగిందన్నారు. విద్యార్థులు క్రీడలు వాటి ఆవశ్యకతను గుర్తించి క్రీడలపట్ల శ్రద్ధ వహించాలన్నారు. శారీరక, మానసిక ఆనందంతోపాటు ఉన్నత విద్యలోనూ, ఉద్యోగాల్లోనూ సర్టిఫికెట్లు ఉపయోగపడుతాయన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి ఎఫ్‌జీఎఫ్ఐ రాష్ట్రస్థాయి అండర్-14లో రాణించిన లోక్షజ్ఞ గౌడ్‌ను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాజీ ఉప రాష్ట్రపతిని కలిసిన వాల్మీకి సంఘ నాయకులు

సింహాద్రిపురం, ఆగస్టు 29: మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడును ఆంధ్రప్రదేశ్ వాల్మీకి సంఘం కడప జిల్లా అధ్యక్షుడు సాకే ఆదినారాయణ (కోవరంగుట్టపల్లి), కొండాపురం మండల అధ్యక్షుడు మునెయ్య, లీగల్ సెల్ అధ్యక్షుడు వెంకటరమణలు గురువారం కలిశారు. ప్రపంచ తెలుగు దినోత్సవం సందర్భంగా యర్రగుంట్ల మండలం కలమల్ల గ్రామానికి వచ్చిన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడిని వాల్మీకి సంఘ నాయకులు కలిసి వాల్మీకుల చిరకాల వాంఛ అయిన ఎస్టీ రిజర్వేషన్ అంశాన్ని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించడానికి సహకారం అందించాలని వినతి పత్రం ద్వారా కోరారు. వెంకయ్యనాయుడు స్పందిస్తూ మీ అంశం కేంద్ర ప్రభుత్వ దృష్టిలో ఉందని, త్వరలోనే పరిష్కారం అవుతుందని తెలిపినట్లు సంఘ నాయకుడు ఆదినారాయణ తెలిపారు.

మృత్యుంజయకుంట శివాలయం హుండీ లెక్కింపు

కడప(కల్చరల్), ఆగస్టు 29: నగర మృత్యుంజయకుంటలో వెలసిన మృత్యుంజయేశ్వర స్వామి దేవాలయం హుండీ లెక్కింపు గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దేవదాయ, ధర్మాదాయ శాఖ ఆలయ కార్యనిర్వాహణాధికారి శ్రీధర్, ఇన్‌స్పెక్టర్ జనార్దన్, ఆలయ ప్రధాన అర్చకుడు సతీష్ శశిధర్ శర్మ హాజరయ్యారు. గత మే నెల 24 నుంచి ఈనెల 29వ తేదీ వరకు స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులు కానుకల ద్వారా ఆలయ హుండీలో సమర్పించిన ఆదాయంగా రూ. 92.648 వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు దక్షిణామూర్తి, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా నాగేశ్వరుని ధ్వజస్తంభ శిఖర కలశ ప్రతిష్ఠ



నాగేశ్వరాలయంలో శిఖర ప్రతిష్ఠ చేస్తున్న దృశ్యం

చెన్నూరు, ఆగస్టు 29 :చెన్నూరులోని లలితాంబికా సమేత నాగేశ్వరస్వామి ఆలయంలో గురువారం ధ్వజస్తంభ శిఖర కలశ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా జరిగింది. మండల వ్యాప్తంగా ప్రతిష్ఠ మహోత్సవానికి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం యంత్రప్రతిష్ఠ, ధ్వజప్రతిష్ఠ, నవగ్రహ ప్రతిష్ఠ అనంతరం ప్రాణ ప్రతిష్ఠ నిర్వహించారు. పూర్ణాహుతి గావించారు. ఈ సంసదర్భంగా శివపార్వతుల ఉత్సవ మూర్తులకు వేద పండితుల ఆధ్వర్యంలో కళ్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. పెద్దఎత్తున తరలివచ్చారు. ఆలయ విస్తీర్ణత తక్కువ అయినా మహిళలు ఆలయం వెలుపల ఇబ్బందికరంగా కూర్చుని కళ్యాణం వీక్షించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు.

పెద్దఎత్తున పోలీసు బందోబస్తు

ట్రంకు రోడ్డులోని నాగేశ్వరాలయం ఎదురుగా మసీదు ఉండడంతో బుధవారం నాటి సంఘటనలు పునరావృతం కాకుండా ఏఎస్పీ వెంకటరాముడు ఆధ్వర్యంలో సీఐ పురుషోత్తం రాజు నేతృత్వంలో పెద్దఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కడప నుంచి వచ్చిన ప్రత్యేక దళాలు బుధవారం రాత్రి నుంచి గురువారం సాయంత్రం వరకు అక్కడే మకాం వేశారు.ఆలయం చుట్టూ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఘనంగా ప్రారంభమైన ఆరోగ్యమాత ఉత్సవాలు



మరియమ్మకు పుష్పమాలను ధరింపచేస్తున్న దృశ్యం

కడప (కల్చరల్), ఆగస్టు 29: నగర రైల్వేస్టేషన్ సమీపంలో వెలసిన వేలంగణి ఆరోగ్యమాత ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా కర్నూలు మేత్రాసన పీఠాధిపతులు బిషప్ గోరంట్ల జ్వానేష్ హాజరై పతాకావిష్కరణ గావించి మాట్లాడారు. మరియతల్లి అనుగ్రహ పరిపూర్ణురాలని, తరతరాల విశ్వాసులంతా ఆమెను ధన్యురాలని కొనియాడబడుతున్నారని అన్నారు. కడపలో కొలువైన ఆరోగ్యమాత సన్నిధిలో చేరి ప్రార్థించిన వారికి ఆ తల్లి దీవెనలు, అనుగ్రహాలు మెండుగా ఉంటాయన్నారు. ఉత్సవాల మొదటి రోజున మరియతల్లి తేరును ప్రత్యేకంగా అలంకరించి చర్చి ప్రాంగణంలో వుంచారు. విశ్వాసులు భక్తి శ్రద్ధలతో ఆతల్లి వద్ద ప్రదక్షిణలు చేశారు. ఆ పుణ్యక్షేత్ర ఫాదర్‌లు, విశ్వాసులు, తిరుణాల కమిటీ పెద్దలు, యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కమలాపురం సీఐగా ఎస్‌కే రోషన్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలను స్వీకరిస్తున్న ఎస్‌కే రోషన్

కమలాపురం రూరల్, ఆగస్టు 29 : కమలాపురం సర్కిల్ ఇన్స్‌పెక్టరుగా ఎస్‌కే రోషన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో అనంతపురం జిల్లా తాడిపత్రి సబ్ డివిజన్ యాడికి సర్కిల్ ఇన్‌స్పెక్టరుగా విధులు నిర్వహిస్తూ బదిలీపై కమలాపురం సర్కిల్ ఇన్స్‌పెక్టరుగా వచ్చారు. కడప జిల్లాలోని అనేక పోలీసుస్టేషన్‌లలో ఎస్ఐగా, సీఐగా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని, ప్రజలు కూడా సహకరించాలని కోరారు.

చోరీ కేసులో ఆటో డ్రైవరు అరెస్టు

కడప (క్రైం), ఆగస్టు 29 : కడప నగరం మద్రాసు రోడ్డులోని ఓ మహిళ సంచిలో బంగారు నగలు దొంగతనం చేసిన ఆటో డ్రైవరును అరెస్టు చేసినట్లు చిన్నచౌకు సీఐ తేజమూర్తి తెలిపారు. కడప సాయిపేటలోని ఏ1 నగర్‌కు చెందిన షేక్ జాఫర్‌వల్లి కడపలో ఆటో తోలుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. చిన్నచౌకులోని మద్రాసు రోడ్డు వద్ద మహిళ కట్టెల బ్యాగులో 51 గ్రాములు బంగారు నగలు ఉన్నాయని ఆటో డ్రైవర్ గుర్తించి కాజేశాడు. ఆటో డ్రైవరను అరెస్టు చేసి అతని వద్ద నుండి రూ.3లక్షలు విలువ చేసే 51 తులాల బంగారు నగలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసును చేధించిన సిబ్బందిని అభినందించారు.

జూదరుల అరెస్టు - రూ.15వేలు స్వాధీనం

వేంపల్లె, ఆగస్టు 29: పట్టణంలోని పాపాఘ్ని నదీ సమీపంలో కంపచెట్లలో జూదమాడుతున్న ఐదుమందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.15వేలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సురేష్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ తిరుపాల్‌నాయక్ ఆధ్వర్యంలో దాడులు చేసి పట్టుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపర్చనున్నట్లు సీఐ తెలిపారు.

ట్రిపుల్‌ఐటీలో మూడో విడతలో 253 మందికి ప్రవేశాలు

వేంపల్లె, ఆగస్టు 29: ఆర్జీయూకేటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ట్రిపుల్‌ఐటీల్లో ఈ విద్యా సంవత్సరంలో చేరే విద్యార్థులకు మూడో విడత కౌన్సెలింగ్ గురువారం ముగిసింది. నాలుగు ట్రిపుల్‌ఐటీలో 454 సీట్లు ఖాళీ గాను విద్యార్థులకు కాల్‌లెటర్లు పంపగా 253మందికి అడ్మిషన్ కల్పించినట్లు కన్వీనర్ అమరేంద్రకుమార్ సండ్ర తెలిపారు. మిగిలిన 201సీట్లకు ఈనెల 31వ తేదీన చివరి విడత కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. గురువారం జరిగిన కౌన్సిలింగ్‌ను డైరెక్టర్ కుమారస్వామి గుప్త ఇతర అధికారుల పర్యవేక్షణలో పూర్తైంది.

మాజీ రిజిస్ట్రార్ సురేంద్రనాథరెడ్డిపై చర్యలు తీసుకోవాలి

● వీసీ విశ్వనాథకుమార్‌కు పీడీఎస్‌యూ వినతి

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 29 :గత వైసీపీ ప్రభుత్వంలో వైఎస్ఆర్ అండ్ ఆర్కిటెక్చర్ యూనివర్సిటీలో అక్రమాలకు పాల్పడిన మాజీ రిజిస్ట్రార్ వీసీ సురేంద్రనాథరెడ్డిపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న డిమాండ్ చేశారు. గురువారం ఆర్కిటెక్చర్ యూనివర్సిటీలో వైస్‌చాన్సలర్ విశ్వనాథకుమార్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ యూనివర్సిటీలో మాజీ రిజిస్ట్రారుగా సురేంద్రనాథరెడ్డి అక్రమ పద్ధతిలో కొనసాగాలని, ఆ ఆక్రమంలో యూనివర్సిటీలో ఔట్ సోర్సింగ్ పోస్టులు రోస్టర్ పద్ధతి ద్వారా కాకుండా డబ్బు తీసుకుని భర్తీ చేశారన్నారు. దీనిపై విచారణ చేసి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యు నాయకులు మహేశ్, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై పోరాటాల్లో ముందుండాలి: పీఎస్‌యూ

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 29 : విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాటాల్లో ముందుండాలని పీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గురువారం పీఎస్‌యు కార్యాలయంలో ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యాసంస్థ ప్రారంభించి మూడు నెలలు కావస్తున్నా నేటికి జిల్లాలోని గిరిజన రెసిడెన్షియల్ వసతిగృహాల్లో ఉపాధ్యాయుల కొరత ఉందన్నారు. విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గత ఏడు నెలలుగా ప్రభుత్వ వసతిగృహాల్లో చదువుతున్న విద్యార్థులకు నెట్ బిల్లులు అందించడంలో ప్రభుత్వం వెనుకబడి ఉందన్నారు. అనంతరం పీఎస్‌యూ కడప నగర నూతన కమిటీని 11 మందితో ఎన్నుకున్నారు. నగర అధ్యక్షుడిగా అనిల్, కార్యదర్శి రామచరణ్, సభ్యులుగా అశోక్, హర్ష, నరసింహ, యుగంధర్, కార్తీక్, అరవింద్, నాని ప్రకటించారు.

కమలాపురం నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

● ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి



మంత్రి టీజీ భరత్‌ను కలిసిన క్రిష్ణచైతన్యరెడ్డి

కమలాపురం రూరల్, ఆగస్టు 29: కమలాపురం నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేసేందుకు సహకరించాలని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌ను కమలాపురం ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి కోరారు. గురువారం విజయవాడలోని మంత్రి భరత్ చాంబరులో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కమలాపురం నియోజకవర్గంలోని కొప్పర్తి పారిశ్రామికవాడను మోడల్ పారిశ్రామికవాడగా అభివృద్ధి చేసేందుకు నిధులు కేటాయించినందుకు ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు మీ అందరి సహకారం కావాలన్నారు. అలాగే ఎన్నో ఏళ్ల నుంచి సమస్యగా మారిన రైల్వే ఫ్లై ఓవర్ నిర్మాణానికి కూడా నిధులు వచ్చేలా సహకరించాలని కోరినట్లు తెలిపారు.

వ్యాసరచన పోటీలలో జూనియర్ విద్యార్థికి మూడవ బహుమతి

చక్రాయపేట, ఆగస్టు 29: తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలలో చక్రాయపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల మొదటి సంవత్సరం ఎంపీసీ విద్యార్థిని కె.జ్యోత్స్న మూడవ బహుమతి సాధించింది. యర్రగుంట్ల మండలం కలమల్లలో జరిగిన తెలుగు భాషా దినోత్సవ కార్యక్రమంలో భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు హాజరు కాగా ఆయన చేతులమీదుగా విద్యార్థిని ప్రశంసాపత్రం, మెమెంటోను సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ రంతుబాష తెలిపారు.

క్రీడలను ప్రారంభించిన ఎంపీడీఓ దివిజసంపతి

వేంపల్లె, ఆగస్టు 29: వేంపల్లెలో క్రీడా దినోత్సవ సంబరాలు గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను ఎంపీడీఓ దివిజ సంపతి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ యోగాంజనేయులులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ విభాగాధిపతి గంగాధర్, పీడీ తేజేంద్ర, అధ్యాపకులు, ఈఓపీఆర్డీ మల్లికార్జునరెడ్డి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

కుల అహంకారమే ప్రతిపక్ష హోదాకు అడ్డు

వైసీపీపై సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ ధ్వజం



ప్రసంగిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

బద్వేలు, ఆగస్టు 29: వైసీపీకి కుల అహంకారంతోనే ప్రతిపక్ష హోదా కూడా రాకుండా చేసిందని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక సుందరయ్య భవన్‌లో గురువారం నిర్వహించిన శాస్త్రీయ, రాజకీయ తరగతుల్లో ఆయన మాట్లాడుతూ 2014 బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటినుంచి దేశంలో మైనార్టీలు, దళితులు, మహిళలపై దాడులు పెరిగాయన్నారు. బీజేపీకి రాజకీయ ప్రతిపక్షం కాంగ్రెస్ అయినప్పటికీ సైద్ధాంతిక ప్రత్యర్థులు వామపక్షాలే అన్నారు. జిల్లాలోని జడ్ హెచ్‌డీసీ దళిత భూములు సుమారు 10 వేల ఎకరాలు అగ్రవర్ణాలు కబ్జా చేసి వారి అధీనంలో పెట్టుకుని ఫోర్జరీ డాక్యుమెంట్లు సృష్టించి అనుభవిస్తున్నారన్నారు. నియోజక వర్గంలోని గోపవరం, బద్వేలు, పోరుమామిళ్ల మండలాల్లో జరిగిన భూ ఆక్రమణలపై కలెక్టర్ సమగ్ర విచారణ నిర్వహించాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కేంద్ర నిధులతో అమృత్ సరోవర్ పనులను చేపట్టాలి


సమావేశంలో మాట్లాడుతున్న కోఆర్డినేటరు లావణ్య

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 29: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నిధులతో అమృత్ సరోవర్ పనులను చేపట్టాలని క్లస్టర్ కోఆర్డినేటర్ లావణ్య తెలిపారు. స్థానిక ఉపాధి కార్యాలయంలో పలుగురాళ్లపల్లె ఉమ్మడి వనరుల అభివృద్ధి సమితి ఆధ్వర్యంలో గ్రామస్థాయిలో అమృత్ సరోవర్ పనులు చేసేందుకు ప్రదేశాన్ని గుర్తించామన్నారు. ఈ విషయాన్ని స్థాయి గ్రామ కమిటీ, మండల స్థాయి ఉమ్మడి వనరుల అభివృద్ధి సమితికి తెలియజేశారు. అమృత్ సరోవర్ ద్వారా నీటి కుంటలు, చెక్‌డ్యాంలు నిర్మించడం వల్ల చుట్టుపక్కల గ్రామస్తులకు భూగర్భజలాలు అభివృద్ధి చెందడం, గ్రామస్థాయిలో ఉన్న పశువులకు తాగునీరు, పశుగ్రాసం పెంపొందించుటకు అవకాశం ఉంటుందన్నారు. వాటర్‌షెడ్ పీఓ వెంకటరమణ కమిటీ సభ్యులతో మాట్లాడి ఎక్కడైతే వాటర్‌షెడ్ నిర్మించాలో ఆ పరిసరాలను పరిశీలిస్తామన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు వై.రవి, సెక్రటరీ ఉదయనాథ్, జిల్లా కమిటీ సభ్యులు ఎస్.ఓబులేసు పాల్గొన్నారు. అనంతరం ఉమ్మడి వనరుల అభివృద్ధి సమితి జిల్లా కమిటీ సభ్యుడిగా సోమిరెడ్డిపల్లె ఓబులేసు (పీటర్)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వృత్తి విద్యా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న వెంకటసుబ్బయ్య

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 29: వృత్తి విద్యను అభ్యసించే విద్యార్థులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని వైవీ యూనివర్శిటీ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం అధ్యాపకులు డాక్టర్ వై.సుబ్బరాయుడు పేర్కొన్నారు. గురువారం ఎస్ఆర్ఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో ఎంబీఏలో చేరిన విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎంబీఏ విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపరచుకుంటే ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగం సహా మార్కెటింగ్, సాఫ్ట్‌వేర్ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వీరకల్యాణ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ పాండురంగన్‌రవి, వైస్‌ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, ఎంబీఏ హెచ్‌ఓడీ షబానాబీ, అధ్యాపకులు, పాల్గొన్నారు.

పెరటికోళ్ల పెంపకంతో ఆదాయం


కోడిపిల్లలను అందజేస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 29: తక్కువ ఖర్చుతో పెరటి కోళ్లను పెంచడం వలన అధిక ఆదాయం పొందవచ్చని శ్రీ వెంకటేశ్వర పశువైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసప్రసాద్ తెలిపారు. కళాశాలలో 50 మంది రైతులకు ఒక్కొక్కరికి 10 ఆసిల్‌జాతి కోడిపిల్లలను అందజేసిన ఆయన మాట్లాడుతూ ఎస్సీ రైతుల సంక్షేమం కోసం పెరటికోళ్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. కోడిగుడ్లు, మాంసం విక్రయం ద్వారా ఆదాయం వచ్చిందని, కోడిగుడ్లు, కోడిమాంసంతో పోషకాహారం లభించి ఆహార భద్రత చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో వైద్యులు పాండురంగారెడ్డి, రాయలరెడ్డి, అశోక్, ఇందిర పాల్గొన్నారు.

సంస్కృతికి చుక్కాని తెలుగు

భాషలకు మూలం తెలుగు ● ప్రపంచ భాషల్లో 16వ స్థానం ● అత్యంత ప్రాచీన భాషగా గుర్తింపు
తెలుగుభాషను గౌరవించాలి ● ఘనంగా తెలుగుభాషా దినోత్సవాలు

ప్రపంచంలోని 6600 భాషల్లో 16వ భాషగా గుర్తింపు తెచ్చుకున్న అత్యంత ప్రాచీన భాష అయిన తెలుగే అన్ని భాషలకు మూలమని వక్తలు కొనియాడారు. ప్రపంచ భాషల్లో అత్యంత గొప్పదైనది, మధురమైనది తెలుగుభాష అన్నారు. ఇందులోని నుడికారాలు, సామెతలు, శబ్దపల్లవాలు, అవధాన ప్రక్రియ మరే భాషలో లేవన్నారు. గ్రాంధిక భాషగా ఉన్న తెలుగును వ్యవహారిక భాషలోకి మార్చడానికి గిడుగు రామ్మూర్తి పంతులు చేసిన కృషి ఎనలేనిదని, తెలుగుభాషా వికాసానికి గురజాడ, కందుకూరి కృషి ప్రశంసనీయమని, రాయప్రోలు, త్రిపురనేని, చిలకమర్తి, శ్రీశ్రీ, వంటి మహాకవులు తెలుగు సాహిత్యాన్ని ఉన్నత శిఖరాలకు చేర్చారని కొనియాడారు.




ప్రొద్దుటూరులో తెలుగుతల్లి విగ్రహానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి - పోరుమామిళ్లలో డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న వక్తలు

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 29: ఎన్ని భాషలు నేర్చుకున్నా తల్లిభాష అయిన తెలుగుభాషను గౌరవించాలని మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి పేర్కొన్నారు. గురువారం మాతృభాష దినోత్సవం సందర్భంగా గాంధీపార్కులో తెలుగుతల్లి విగ్రహానికి పూలమాల సమర్పించిన ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలకు తెలుగుభాషపై మమకారం పెంచాలని సూచించారు. జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గిడుగు రామ్మూర్తి పంతులు జన్మదినాన్ని మాతృభాషా దినోత్సవంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. కొత్తపల్లి శ్రీను, సాధు గోపాలక్రిష్ణ, కంభం పాములేటి, ఆరవేటి రాజా, సుబ్బరాయుడు, కాశీవరపు వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

భారతీయ భాషల్లో మేటి తెలుగు

జమ్మలమడుగు, ఆగస్టు 29: భారతీయ భాషల్లో మేటి తెలుగని ఎంఈఓ చంద్రశేఖర్‌రావు అన్నారు. జమ్మలమడుగులో తెలుగుభాష, క్రీడాదినోత్సవాలను ఘనంగా చేసుకున్నారు. గూడెం చెరువు హైస్కూల్‌లో హెడ్మాస్టర్ కవిత, ఉపాధ్యాయులు గురుకుమార్, విద్యాసాగర్, వెంకటసుబ్బయ్య, సుజాత, మంజుల, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

● శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ జింకా చంద్రశేఖర్ ఆధ్వర్యంలో డాక్టర్ ఎంఎల్ నారాయణరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మాతృభాష దినోత్సవాలు ఘనంగా జరిగాయి. ప్రిన్సిపాల్ బండారు శ్రీనివాసులు మాట్లాడారు. కథ, రచయిత దర్పణం శ్రీనివాస్‌ను సన్మానించారు. ఉపాధ్యాయులు అమీర్, నరసింహులు, దాదాఖలందర్, లక్ష్మీనారాయణ, రామయ్య, సుబ్బారెడ్డి, మధుబాబు, గిరి, పాల్గొన్నారు.

● ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో క్రీడా, తెలుగుభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ పుట్టిన రోజును జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగుభాషా దినోత్సవం చేసుకున్నారు. అధ్యాపకులు సంజీవరెడ్డి, పీడీ షఫి, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలుగుభాష ప్రశస్తిని కాపాడుకుందాం

బద్వేలు, ఆగస్టు 29: తెలుగుభాషా వైభవాన్ని, విశిష్టతను కాపాడుకుందామని చిన్నకేశంపల్లె జడ్పీ హైస్కూల్ హెచ్ఎం పెంచలయ్య పిలుపు నిచ్చారు. తెలుగుభాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాలను నిర్వహించారు. తెలుగుటీచర్ మాదన విజయ్‌కుమార్ మాట్లాడారు. ఉపాధ్యాయులు సుబ్బరాయుడు, వరలక్ష్మి, గౌస్ బాష పాల్గొన్నారు.

● మానవ జీవితాలకు వెలుగు మాతృభాష తెలుగు అని తెలుగు భాషావికాస ఉద్యమ, మొల్ల సాహితీపీఠం అధ్యక్షుడు గానుగపెంట హనుమంతరావు పేర్కొన్నారు. పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో తహసీల్దారు ఉదయభాస్కర్‌రాజు, ఎంపీడీఓ రామక్రిష్ణ, అష్టావధాని శివశ్రీశర్మ, ఎస్ఐ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

●మనసును తీర్చిద్ది సంస్కారం నేర్పే భాష తెలుగు భాష అని వీరారెడ్డి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటసుబ్బారెడ్డి అన్నారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో తెలుగు భాష, జాతీయ క్రీడా దినోత్సవాలను నిర్వహించారు. వృత్తి విద్యా కళాశాల ప్రిన్సిపాల్ శ్యాం సుందర్, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్తలు దొరస్వామి నాయక్, ఈశ్వరయ్య, మహేష్, ఫిజికల్ డైరెక్టర్ ఆదినారాయణ రెడ్డి, జి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల డిగ్రీకళాశాలలో...

పోరుమామిళ్ల, ఆగస్టు 29: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ తెలుగుభాషా దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ ప్రకాశ్‌రావు అధ్యక్షతన గురువారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా, క్రీడాదినోత్సవాలను నిర్వహించారు. అధ్యాపకులు సులోచన తదితరులు పాల్గొన్నారు.

పిట్టిగుంట హైస్కూల్‌లో...

కాశినాయన ఆగస్టు29: అన్ని భాషలకు మాతృభాష మూలాధారమని పిట్టిగుంట ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం నారాయణస్వామి, ఉపాధ్యాయుడు జి.రమణారెడ్డి పేర్కొన్నారు. విద్యార్థులకు పద్యాలు, కథల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

గురుకుల పాఠశాలలో...

బి.కోడూరు, ఆగస్టు 29: సగిలేరు గురుకుల పాఠశాలలో తెలుగుభాషా దినోత్సవం నిర్వహించారు. ఆధ్యాత్మిక రచయిత జాతీయ అవార్డు గ్రహీత కృష్ణానాయక్, ప్రిన్సిపాల్ నిరంజన్, వైస్ ప్రిన్సిపల్ భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ బాలికల హైస్కూల్‌లో...

బ్రహ్మంగారిమఠం. ఆగస్టు 29: స్థానిక జడ్పీ బాలికల హైస్కూల్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో తెలుగుభాషా, క్రీడా దినోత్సవాలు నిర్వహించారు. క్రీడాపోటీల్లో విజేతలకు మెమెంటోలు అందించారు. సీనియర్ అధ్యాపకులను సన్మానించారు. హెడ్మాస్టరు నిర్మలదేవి, తెలుగు టీచర్ లెక్కల కొండారెడ్డి, ప్రిన్సిపాల్ పద్మనాభమూర్తి, అధ్యాపకులు, వైద్యాధికారి సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా తెలుగుభాషా దినోత్సవాలు


తెలుగుతల్లి వేషధారణతో నృత్యం

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 29: సరోజినీ హైస్కూలులో తెలుగుభాషా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం శివకుమార్ విద్యార్థులకు తెలుగుభాష గొప్పదనం వివరించారు. విద్యార్థులు తెలుగుతల్లి వేషధారణ, పద్యాలు, శ్లోకాలు, తెలుగు పద క్రీడలతో అలరించారు. ప్రతిభావంతులకు బహుమతులను అందజేశారు. విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

రాజుపాలెం, ఆగస్టు 29: కొరపాడు వాసి గుద్దేటి ప్రభాకర్‌రెడ్డి (48) అదృశ్య మయ్యాడు. బుధవారం ఉదయం 9 గంటలకు ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో అతని భార్య రాధ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్ఐ కత్తి వెంకటరమణ మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భూతగాదా... ఇద్దరికి గాయాలు

చాపాడు, ఆగస్టు 29: మండలంలోని వీరభద్రాపురం గ్రామంలో బుధవారం రాత్రి 11 గంటలకు జరిగిన ఘర్షణలో ఇద్దరు వ్యక్తులు గాయపడినట్లు పోలీసులు తెలిపారు. వరకూటి గురివిరెడ్డి, వరకూటి చంద్ర ఓబుళరెడ్డి, గురుమోహన్‌రెడ్డి, మరో నలుగురు కలిసి అదే గ్రామానికి చెందిన బద్వేలు సురేంద్రారెడ్డి, చంద్రమోహన్‌రెడ్డిని కర్రలు, ఇనుప రాడ్లతో కొట్టి గాయపరిచినట్లు వారు పేర్కొన్నారు. గ్రామం వద్ద సర్వే నంబరు 311/ఎ1లో 1.35 ఎకరాల చుక్కల భూమి ఉందన్నారు. ఇందులో సురేంద్రారెడ్డి, గురివిరెడ్డి 22 సెంట్ల భూమికోసం కొన్నేళ్లుగా తగాదా పడుతున్నట్లు తెలిపారు. గాయపడిన ఇద్దరిని చికిత్స కోసం ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కొండాపురం, ఆగస్టు 29: తాళ్లప్రొద్దుటూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో బింగి నరసింహులుకు గాయాలయ్యాయి. ఏటూరు వాసి నరసింహులు టీవీఎస్ మోపెడ్‌లో వెళుతుండగా తాళ్లప్రొద్దుటూరు వద్ద వెనక నుంచి మరో బైకు ఢీకొంది. దీంతో నరసింహులు కింద పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. అనంతపురం ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కేసు నమోదు చేసినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ హృషికేశ్వర్‌రెడ్డి తెలిపారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

రాజుపాలెం, ఆగస్టు 29: గాదెగూడూరు వాసి ఓబులేసు నుంచి 25 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కత్తి వెంకటరమణ అన్నారు. గురువారం మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో అతన్ని పట్టుకుని అతని వద్ద బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఏసీపీ ఉన్నంత వరకు అడుగుపెట్టను

మున్సిపల్ స్థలాల పరిరక్షణలో వైఫల్యాన్ని నిరసిస్తూ కౌన్సిలర్ సరిత బాయ్‌కాట్

నడింపల్లెలో కాల్వను సర్వేచేయించి నివేదిక తెప్పిస్తా : కమిషనర్


సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్లు

ప్రొద్దుటూరు, ఆగస్టు 29: కాలువ పోరంబోకు, మరుగుదొడ్ల స్థలాలు పరిరక్షించడంలో టౌన్‌ప్లానింగ్ అధికారులు విఫలమయ్యారని టీడీపీ కౌన్సిలర్ చింతకుంట సరిత ఆరోపించారు. టౌన్‌ప్లానింగ్ ఏసీపీ మునిరత్నం తీరును నిరసిస్తూ అతను ఉన్నంత వరకు కౌన్సిల్ సమావేశంలో అడుగుపెట్టనని బాయ్‌కాట్ చేశారు. గురువారం మున్సిపల్ సభా భవనంలో చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి అధ్యక్షతన చేపట్టిన అత్యవసర కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్ చింతకుంట సరిత బాయ్‌కాట్‌పై కమిషనర్ రఘునాథరెడ్డి స్పందిస్తూ కౌన్సిలర్ సరిత ఫిర్యాదు మేరకు నడింపల్లెలో కాలువను సర్వే చేయించి నివేదికను వచ్చే సమావేశానికి తెస్తానని హామీ ఇచ్చారు. అజెండాలోని 2అంశం నుంచి 6 అంశం వరకు ప్రధాన కాలువల పూడిక తీత పనుల టెండర్లకు ఆమోదం తెలిపారు. పూడిక తీత పనులు ఇంకా మొదలు పెట్టకపోవడంపై మున్సిపల్ వైస్‌చైర్మెన్ బంగారురెడ్డి అధికారుల తీరును తప్పుబట్టారు. వర్షాలు రాకముందు పూడిక తీస్తారా వర్షాలు వచ్చిపోయాక పనులు చేస్తారా అని ఎద్దేవా చేశారు. కమిషనర్ స్పందిస్తూ పనులు మొదలు పెట్టామని సమాధానం ఇచ్చారు. తాత్కాలిక కూరగాయల మార్కెట్‌లో కూడా రోడ్ల మీద వ్యాపారులు కూరగాయలు పోసి ప్రజలకు అసౌకర్యం కల్పిస్తున్నారని, వారి బండలు రద్దు చేస్తామని చెప్పి చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ గరిశపాటి డిమాండ్ చేసింది.

మక్కా మసీదు వద్ద కాలువలో సిల్ట్ తీసే పేర గ్రిల్స్ తొలగించి సిల్ట్ తీయలేదని కౌన్సిలర్ గాజుల శివజ్యోతి ఆరోపించారు. ఇందువల్ల గ్రిల్స్ పూడిపోయాయని పరిశీలించి చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. పూడికతీత పనులపై కౌన్సిలర్లకు ఎక్కడెక్కడ పనులు జరుగుతున్నాయో చెబితే తాము పరిశీలిస్తామని కౌన్సిలర్ జిలాన్ అన్నారు. ఎన్ని వీల్ బార్లు పుష్‌కాట్‌లు కొనుగోలు చేశారు. వార్డుకు ఎన్ని ఇస్తున్నారో తెలపాలని కోరగా 40 వీల్ బార్లు 40 పుష్‌కాట్లు కొనుగోలు చేశామని వార్డుకు ఒకటి ఇస్తామని ఏఈ బ్యూలా వివరించారు. టీడీపీ కౌన్సిలర్ వంగనూరు మురళీధర్ రెడ్డి మాట్లాడుతూ 5వవార్డులో పందులు ఆవుల సమస్యను పరిష్కరించాలని కోరారు. ఇందుకు పందులను ఒకసారి పట్టామని రెండోసారి కూడా పందులు పట్టి తరలిస్తామని అలాగే ఆవులను గోశాలకు తరలిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. అనంతరం 16 అంశాల అజెండాను ఆమోదించారు.

దివ్యాంగుల కేంద్రంలో అన్నదానం


వికలాంగుల కేంద్రంలో అన్నదానానికి సిద్ధం చేసిన యువకులు

ప్రొద్దుటూరు క్రైం, అగస్టు 29: నల్లబోతుల నాగరాజు జన్మదినం పురస్కరించుకుని అన్నదానం నిర్వహించారు. నల్లబోతుల యూత్ ఆధ్వర్యంలో రామేశ్వరంలోని వికాస్ విహార్ మానసిక వికలాంగుల కేంద్రంలో అన్నదానం జరిపారు. అంతకు ముందు అక్కడి పిల్లల సమక్షంలో భారీ కేక్ కట్ చేసి తమ అభిమాన నేతకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పెన్నానగర్ వాసులు సుధాకర్, మస్తాన్, మల్లీ, సుబ్బరాయుడు, మధు పాల్గొన్నారు.

ఇంటింటికీ కొళాయి 'జలజీవన్ మిషన్' లక్ష్యం

జమ్మలమడుగు, ఆగస్టు 29: ఇంటింటికీ కుళాయి జలజీవన్ మిషన్ ఉద్దేశమని సంబంధిత అధికారులు తెలిపారు. మండలంలో జలజీవన్ మిషన్ (జేజేఎం) పథకంలో భాగంగా క్షేత్రస్థాయిలో అమలు వివరాలు తెలుసుకోవడానికి సంబంధిత అధికారులు నేషనల్ వాష్ ఎక్స్‌పర్ట్ కమిటీ తనిఖీ చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకమైన జలజీవన్ మిషన్ అమలుపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రామ్‌సేన్, వెంకటేశ్వరరావు బృందం గండికోట, గొరిగెనూరు సందర్శించారు. జలజీవన్ మిషన్ పనితీరును పరిశీలించి గండికోట గ్రామస్థులతో మాట్లాడారు. ప్రతి ఇంటికీ మంచినీరు అందించడమే లక్ష్యంగా పంచాయతీ అధికారులు సిబ్బంది పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ విజయభాస్కర్, ఏఈ టి.నరసింహులు, సర్పంచ్ గురుఈశ్వర్, పంచాయతీ కార్యదర్శి గురుమహేంద్రరెడ్డి, గ్రామ ప్రజలు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మెడికల్ హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 29: ప్రజల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా రాష్ట్రంలో ప్రభుత్వం హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించాలని దళిత సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ యల్లయ్య మాదిగ డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందున ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం రూ.5 వేల కోట్ల నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మంకీపాక్స్, చండీపుర వైరస్ రాష్ట్రంలోకి రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడిగా జహంగీర్‌బాషా

బద్వేలు రూరల్, ఆగస్టు 29: మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి నియోజకవర్గ అధ్యక్షుడిగా షేక్ జహంగీర్‌బాషాను నియమించినట్లు ఆయన తెలిపారు. మైనార్టీ హక్కుల కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఫరూక్, షగ్గి నియామక పత్రం అందించినట్లు తెలిపారు. టీడీపీ మైనార్టీ నేతగా, మైనార్టీల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తుండడంతో ఈపదవి ఇచ్చినట్లు తెలిపారు.

నేడు డయల్ యువర్ డీఎం

జమ్మలమడుగు, ఆగస్టు 29: జమ్మలమడుగు ఆర్టీసీ డిపో కార్యాలయంలో శుక్రవారం డయల్ యువర్ డీఎం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ ప్రవీణ్ తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. జమ్మలమడుగు ఆర్టీసీ డిపోలో బస్సుల విషయంలో ప్రయాణికులకు సమస్యలు, ప్రజలు సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. 9959225778 నంబరుకు ఫోన్ చేసి తెలుపగలరని ఒక ప్రకటనలో తెలిపారు.

78 పెన్షన్ల తొలగింపు

కొండాపురం, ఆగస్టు 29: మండలంలో 78 సామాజిక పెన్షన్లను తొలగించినట్లు ఎంపీడీఓ నాగప్రసాద్ తెలిపారు. ఇతర జిల్లాల నుంచి సదరం సర్టిఫికెట్లు తెచ్చుకున్న 239 మందికి నోటీసులు పంపగా 78 మంది కడప రిమ్స్‌లో రీవెరిఫికేషన్‌కు హాజరయ్యారన్నారు. 78 సర్టిఫికెట్లను డాక్టర్లు నకిలీవిగా తేల్చారన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు 78 మందికి పెన్షన్లను తొలగించినట్లు ఆయన తెలిపారు. 1వతేదీ ఆదివారం అయినందున 31 వతేదీ శనివారం సచివాలయ సిబ్బంది ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్లను పంపిణీ చేస్తారని ఎంపీడీఓ తెలిపారు.

దళితులపై దాడులను అరికట్టాలి

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 29: ఇటీవల దళితులపై దాడులు పెరిగిపోయాయని, దాడులను ఆపకపోతే ఆందోళన చేస్తామని మాలమహానాడు రామాజీ ఇమ్మానుయేల్ వర్గం రాష్ట్ర అధ్యక్షుడు తాళ్లపాక వినోద్‌కుమార్ పేర్కొన్నారు. విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం దళిత, బడుగు, బలహీన వర్గాలవారిని పక్కనబెట్టి అగ్రవర్ణాలు, డబ్బులిచ్చినవారికి భూములు కేటాయించడం దారుణమన్నారు. మాలమహానాడు ప్రొద్దుటూరు నియోజకవర్గ అధ్యక్షుడిగా డేగల జకరయ్య, మహిళా అధ్యక్షురాలిగా మేకల ఉమ, రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా ఉల్లి కిరణ్‌కుమార్ తదితరులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

రోడ్డుపై గుంతలను పూడ్చాలి

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 29: అమ్మవారిశాల వద్ద నుంచి గవిని సర్కిల్ వరకు ఉన్న రోడ్డుపై గుంతలను పూడ్చడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ పేర్కొన్నారు. గుంతలు పూడ్చాలని గవినిలో సీపీఐ నేతలు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. సీపీఎం నేతలు పక్కీరయ్య, బాలసుబ్బయ్య, ముంతాజ్‌బేగం, రాములమ్మ, చెన్నారెడ్డి, నరసింహ, విశ్వనాథ్ పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణుడి ఊరేగింపు



ముద్దనూరు ఆగస్టు29: ఉప్పలూరులో గురువారం శ్రీకష్ణ భగవానుని ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందు జ్ఞానవేదిక ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి నుంచి వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం పురవీధుల్లో శ్రీకృష్ణ ప్రతిమను ఊరేగించారు.